ఉష్ణోగ్రత గురువారం గరిష్ఠం : 27.0 కనిష్ఠం : 17.0

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 3

శ్రీ సత్యసాయి జిల్లా వార్తలు

శుక్రవారం 28 నవంబరు 2025

## అయ్యో..! ఇంత ఘోరమా..!



- తల్లీకొడుకు అనుమానాస్పద మృతి
- అనంతలో విషాదకర ఘటన

(4లో...)



సహర్ష (ఫైల్)

# చేతులెట్లా వచ్చాయ్ మామా..!

బాలుడిని చంపేసిన మేనమామ

నమ్మించి తీసుకెళ్లి గొంతు నులిమేశాడు

- బావపై కోపంతో మృగంగా మారిన ప్రసాద్
- ఎన్‌పీకుంట అటవీ ప్రాంతంలో మృతదేహం
- తలుపుల మండలం గరికపల్లిలో విషాదం



విషాదంలో బాలుడి తల్లిదండ్రులు, సోదరి

"మామా..! నువ్వొస్తే పరిగే...త్తుకుంట వచ్చి నీ కాళ్లను వాటేసుకుంటానే..! నువ్వు ఎత్తుకోగానే మెడను చుట్టేసి అల్లుకుపోతానే..! నువ్వు ముద్దు పెట్టుకుంటే ఎంత మురిసిపోతానో నీకు తెలుసు కదా..? నీ చేతి వేలు పట్టుకుని ఊరంతా తిరిగేటోన్ని..! నీ బైకు మీద ఎక్కి సంబరంగా తిరిగేటోన్ని..! ఎన్నెన్ని ముచ్చట్లు చెప్పేటోడిని మామా నీకూ..! అమ్మానాయనకంటే నువ్వంటేనే కదా నాకు ఎక్కువ ఇష్టం..? నన్నెట్లా చంపేశావు మామా..? నీకు చేతులెట్లా వచ్చాయి మామా..?"

4



హర్షవర్ధన్(ఫైల్)

### మడకశిర రెవెన్యూ డివిజన్ గెజిట్ నోటిఫికేషన్ జారీ

గోరంట్ల, అమడగూరు విలీనంపై కూడా..

నెలరోజులపాటు అభ్యంతరాల స్వీకరణ

పుట్టపర్తి, నవంబరు27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మడకశిర రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ గురువారం విడుదల చేసింది. రాష్ట్రంలో కొత్త జిల్లాల ఏర్పాటుపై మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సులకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా జిల్లాలో కొత్తగా మడకశిర రెవెన్యూ డివిజన్‌కు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వగా.. గురువారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. మడకశిర, అగళి, గుడిబండ, రొళ్ల, అమరాపురం మండలాలతో కొత్త రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు నోటిఫికేషన్ ఇచ్చారు. పుట్టపర్తి రెవెన్యూ డివిజన్‌లోని గోరంట్ల మండలాన్ని పెనుకొండ డివిజన్‌లోకి, కదిరి రెవెన్యూ డివిజన్‌లోని అమడగూరును పుట్టపర్తిలోకి విలీనం చేయనున్నారు. ఆ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఆయా ప్రాంతాల ప్రజల నుంచి నెలరోజులపాటు అభ్యంతరాలు, సూచనలు లిఖితపూర్వకంగా స్వీకరించనున్నారు.


# మారనున్న రూపురేఖలు!




- రెవెన్యూ డివిజన్‌గా మడకశిర
- వేగంగా భూసమస్యల పరిష్కారం
- భూముల ధరలు పెరిగే అవకాశం

మడకశిర/మడకశిరటౌన్, నవంబరు27(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ డివిజన్‌గా మడకశిర మారనుండటంతో నియోజకవర్గంలో 55 రెవెన్యూ గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ డివిజన్‌గా ఏర్పడితే మడకశిర రూపురేఖలు మారుతాయని, అభివృద్ధికి బాటలు పడతాయని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇకమీదట భూ సమస్యలపై వందల కిలోమీటర్ల దూరంలోని పెనుకొండ ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లే బాధ తప్పిందని సంబరపడుతున్నారు. తమ భూ సమస్యలు కూడా వేగంగా పరిష్కారమయ్యే అవకాశం ఉంటుందని వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మడకశిర రెవెన్యూ డివిజన్‌గా ఏర్పడితే ఇక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారం కూడా జోరుగా సాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. కర్ణాటక సరిహద్దు కావడం, జాతీయ రహదారి కూడా ఈమార్గం మీదుగా పోతుండటంతో భూముల ధరలు మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు కొందరు రియల్టర్లు చెబుతున్నారు. పారిశ్రామికంగా కూడా నియోజకవర్గం అభివృద్ధి చెందే అవకాశం ఏర్పడనుంది.





### పరిపాలన సౌలభ్యం: ఎంఎస్ రాజు, ఎమ్మెల్యే



మడకశిర రెవెన్యూ డివిజన్ కావడం వల్ల పరిపాలన సౌలభ్యం ఏర్పడుతుంది. నియోజకవర్గంలో ఎంతోమంది రైతులు భూ సమస్యల పరిష్కారం కోసం పెనుకొండ, పుట్టపర్తి ఆర్డీఓ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. రెవెన్యూ డివిజన్ ఏర్పాటైతే అంతదూరం పోకుండా స్థానికంగానే సమస్యలు పరిష్కరించుకోవచ్చు. రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు సహకరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు నారా లోకేశ్, అనగాని సత్యప్రసాద్, కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

### దశాబ్దాల కల



మడకశిర నియోజకవర్గం నుంచి రెవెన్యూ డివిజన్ ఉన్న పెనుకొండకు వెళ్లేందుకు రైతులు, ప్రజలు అనేక ఇబ్బందులు పడేవారు. ఈసమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సానుకూలంగా స్పందించి రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు చర్యలు తీసుకొన్నారు. దీనివల్ల ఎంతో మంది రైతులు భూ సమస్యల పరిష్కారంతో పాటు అనేక రకాల సమస్యల పరిష్కారానికి వ్యయప్రయాసలు తప్పనున్నాయి.

-గుండుమల తిప్పేస్వామి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

### చాలా దూరం ఉంది..



మాది గౌడనకుంట గ్రామం. మా ఊరి నుంచి పెనుకొండకు 110 కిలోమీటర్ల దూరం ఉంది. చిన్న సమస్య అయినా స్థానిక అధికారులు ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లాలని సూచిస్తే పెనుకొండకు వెళ్లాల్సి ఉండేది. వన్‌బీలో కానీ అడంగల్‌లో కానీ ఏ ఇతర సమస్య అయినా పెనుకొండకు వెళ్లాల్సి ఉండేది. మడకశిరలో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తే ప్రయాణ సమస్యలు తొలగి పోనున్నాయి. రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు కృషి చేసిన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీలకు కృతజ్ఞతలు.

- గురుసిద్ధప్ప, గౌడనకుంట, అమరాపురం మండలం

### ప్రయాణ బాధలు తప్పుతాయి

మడకశిరలో ఆర్డీఓ కార్యాలయం ఏర్పాటు చేస్తే ఎన్నో సమస్యలు పరిష్కారం అవుతాయని అనేకసార్లు విన్నవించాం. ఎట్టకేలకు ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవ వల్ల మడకశిర రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కానుంది. భూ సమస్య వస్తే మారుమూల గ్రామాల నుంచి పెనుకొండకు వెళ్లడానికి రూ.వెయ్యి నుంచి రూ.2వేలు ఖర్చు పెట్టుకోవాల్సి వచ్చేది. ఇప్పుడు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కావడం వల్ల ఆ బాధలు తొలగిపోనున్నాయి.

-కల్లప్ప, రైతు సంఘం నాయకులు, మధూడి, అగళి మండలం



## ఎక్కడికెళ్లారో.. ఏమయ్యారో..?

ఉమ్మడి జిల్లాలో ఐదుగురి అదృశ్యం

4

## నేటితో ఆఖరు

- ముగియనున్న హౌసింగ్ సర్వే
- పెండింగ్‌లో 7వేల కుటుంబాలు
- ఆందోళనలో ఆయావర్గాలు

### హాస్టళ్లలో మెరుగైన వసతులు కల్పించాలి

- కలెక్టర్ శ్యాంప్రసాద్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యాంప్రసాద్

పుట్టపర్తి టౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థినీవిద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని అధికారులను కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆదేశించారు. నాణ్యమైన ఆహారం, నీరు, పారిశుద్ధ్యం పక్కాగా అందించాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు, ప్రజాసానుకూల అవగాహన, స్వమిత్వ, సంక్షేమ, గురుకుల వసతి గృహాలు తదితర అంశాలపై విజయవాడ నుంచి ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి విజయానంద్.. కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ.. గురుకుల పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో మెరుగైన వసతులు కల్పించాలన్నారు. కళాశాలలు, పాఠశాలల్లో ఈగల్ క్లబ్స్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి విద్యాసంస్థలో మత్తుపదార్థాల అనర్థాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

# 25.29 కోట్లు..!

- జిల్లాలో ఉపాధి బిల్లు బకాయిలు
- నాలుగు నెలలుగా చెల్లింపుల్లేని వైనం
- కార్యాలయాల చుట్టూ కూలీల ప్రదక్షిణ
- బిల్లులు రాక పస్తులుండాల్సిన దుస్థితి
- వలసే శరణ్యమంటున్న కూలీలు



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

మడకశిర, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధి బిల్లుల చెల్లింపులు నాలుగు నెలలుగా ఆగిపోయాయి. బకాయిలు ఏకంగా రూ.25.29 కోట్లకు చేరాయి. నెలలుగా బిల్లులు అందకపోవడంతో ఇల్లు గడవడం కష్టమవుతోందని కూలీలు వాపోతున్నారు. వ్యవసాయ పనులు కూడా లేవనీ, పస్తులుండాల్సిన దుస్థితి దాపురించిందని వాపోతున్నారు. బిల్లులు ఇవ్వకపోతే వలస బాట పట్టాల్సిందేనని ఆవేదన చెందుతున్నారు. జూలై 28 నుంచి కూలీలకు ఉపాధి బిల్లులు చెల్లించాల్సి ఉంది.

#### నెలలు గడుస్తున్నా..

శ్రీసత్యసాయి జిల్లాలో రెండు లక్షలకు పైగా జాబ్ కార్డులు ఉన్నాయి. 40వేల మందిదాకా కూలీలు పనులకు వెళ్తున్నారు. పనులు చేసిన వారానికే బిల్లులు.. కూలీల ఖాతాల్లోకి జమకావాల్సి ఉంది. ప్రస్తుతం పనులు చేసి.. నెలలు గడుస్తున్నా.. బిల్లులు అందట్లేదు. మడకశిర నియోజకవర్గంలోనే రూ.5 కోట్లదాకా బిల్లులు పెండింగ్ ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో కార్యాలయాల చుట్టూ ఉపాధి కూలీలు ప్రదక్షిణ చేయాల్సి వస్తోంది.

#### ఆరు వారాలైనా కూలి డబ్బులు జమ కాలేదు



ఉపాధి పనులు చేసి 6 వారాలైంది. కూలి డబ్బులు నేటికీ ఖాతాలోకి జమకాలేదు. ఇప్పటికైనా బిల్లులు చెల్లించి, ఆదుకోవాలి.

-కాంతరాజు, మల్లినమడుగు, మడకశిర మండలం

#### నిధులు రాగానే.. ఖాతాల్లోకి జమ

ఉపాధి హామీ పనులు చేసిన కూలీలకు జిల్లాలో రూ.25.29కోట్లు బిల్లులు చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం నిధులు విడుదల చేసిన వెంటనే కూలీల ఖాతాల్లోకి జమవుతాయి.

-విజయేంద్రప్రసాద్, పీడీ, డ్వామా

### మంత్రి గొప్ప మనసు

- 1,800 మంది విద్యార్థుల పది పరీక్షల ఫీజు చెల్లింపు

ధర్మవరం రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ గొప్ప మనసు చాటుకున్నారు. నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 1,800 మంది పదోతరగతి విద్యార్థుల పరీక్ష ఫీజులు చెల్లించి, వారికి అండగా నిలిచారు. మంత్రి వేతనం నుంచి ఆ సొమ్ము చెల్లించనున్నట్లు ఆయన కార్యాలయం గురువారం ప్రకటనలో తెలిపింది. నియోజకవర్గంలోని 1,800 మంది విద్యార్థుల ఫీజు రూ.2.34 లక్షలు సమర్పిస్తూ కలెక్టర్ శ్యాంప్రసాద్‌కు లేఖ పంపారు. దీంతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఉపశమనం లభించింది. మంత్రికి విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఊరికి దూరం.. ప్రజలకు భారం..!

- కిలో మీటరు దూరంలో తహసీల్దార్ కార్యాలయం
- నల్లమాడ మండల ప్రజల అవస్థలు



బాలుర వసతి గృహంలో నిర్వహిస్తున్న తహసీల్దార్ కార్యాలయం

నల్లమాడ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండల ప్రజలకు అతిముఖ్యమైనది తహసీల్దార్ కార్యాలయం. నిత్యం ప్రజలు, విద్యార్థులు, రైతులు, వృద్ధులు వివిధ పనుల కోసం తహసీల్దార్ కార్యాలయానికి వెళుతుంటారు. నల్లమాడ మండలంలో ఊరికి కిలో మీటరు దూరంలో తహసీల్దార్ కార్యాలయం ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడేళ్ల క్రితం పాత తహసీల్దార్ కార్యాలయం వర్షాలకు తడుస్తోందని, పైకప్పు పెచ్చులూడి కిందపడుతున్నాయని, రికార్డులు తడుస్తాయన్న భయంతో అప్పటి తహసీల్దార్ ఉన్నతాధికారులకు నివేదికలు పంపించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కార్యాలయాన్ని ఎస్టీ బాలుర వసతి గృహానికి మార్చారు. అప్పటి నుంచి ఆ కార్యాలయం నుంచే విధులు నిర్వహిస్తున్నారు. ఈ కార్యాలయం ఊరికి చివరలో.. కిలోమీటరుకు పైగా దూరంలో ఉండడంతో వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు వెళ్లడానికి వ్యయప్రయాసాలు పడాల్సి వస్తోంది. తీరా అక్కడికెళ్లాక సంబంధిత అధికారులు లేకపోతే వృథాగా ప్రయాసలు పడి నడుచుకుని మండల కేంద్రానికి చేరుకోవాల్సి ఉంటుంది. నడవలేని వృద్ధులు, దివ్యాంగులు, ఆటోలకు రూ. 50 చెల్లించి పోవాల్సిన దుస్థితి నెలకొందని ఆందోళన చెందుతున్నారు. పాత తహసీల్దార్ కార్యాలయానికి మరమ్మతులు చేయించాలని, లేదంటే నూతన భవనం నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు. మూడేళ్ల గడుస్తున్నా కార్యాలయంపై ఉన్నతాధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

#### ఉన్నతాధికారులకు నివేదిక పంపాం

పాత తహసీల్దార్ కార్యాలయానికి మరమ్మతులు చేయాలని లేదంటే నూతన భవనాన్ని నిర్మించాలని జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం. ఉన్నతాధికారుల నుంచి ఇంత వరకు ఎలాంటి సమాచారం రాలేదు. మరోసారి ఈ విషయమై జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం.

- మనోజ్‌కుమార్ రెడ్డి, తహసీల్దార్, నల్లమాడ

# ఆయుష్ తీరిపోయిందా..?

- పత్తాలేని వైద్యులు
- నాలుగేళ్లుగా అందని యునాని వైద్యం

గాండ్లపెంట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రకృతిలో లభించే వనమూలికలు, ఔషధ గుణాలు కలిగిన వివిధ లేహాలతో గుళికలు తయారు చేసి జబ్బులను నయం చేయడాన్ని యునాని వైద్యంగా పేర్కొంటారు. ప్రభుత్వం లక్షలు ఖర్చుచేసి మండలాలలో సైతం యునాని వైద్యం అందిస్తోంది. వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో అది కాస్తా కనుమరుగైంది. చిన్నపిల్లలు, పెద్దలు సైతం యునాని వైద్యం చేయించుకుని జబ్బులను నయం చేసుకునేవారు. గాండ్లపెంట మండలంలో ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో యునాని డాక్టర్లను నియమించి రోగులకు సేవలు అందించేవారు. గత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఆ సేవలు కాస్తా కనుమరుగయ్యాయి. ప్రస్తుతం ఆ విభాగం దిష్టిబొమ్మలా మారింది.



యునాని మందులను మూలన పడేసిన దృశ్యం

#### నాలుగేళ్లుగా నిలిచిన సేవలు

గాండ్లపెంట మండలంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో యునాని వైద్యసేవలు అందిస్తున్నారు. వైద్యులు లేకపోవడంతో నాలుగేళ్లుగా ఆ విభాగం మూతపడింది. ఇటీవల ప్రభుత్వ ఆసుపత్రిలో ఆయుష్ డిపార్ట్‌మెంట్ బోర్డును ఏర్పాటు చేయడంతో తిరిగి వైద్య సేవలు ప్రారంభమయ్యాయా అని ప్రజలు చర్చించుకుంటున్నారు. యునాని వైద్యానికి అందించే ఔషధాలు, మూలికలు ప్రభుత్వ ఆసుపత్రిలో ఒక మూలన పడేశారు. ఇక్కడ పనిచేస్తున్న యునాని వైద్యుడు కేకే కరీముల్లా ఖాన్ నాలుగు మండలాలకు ఇన్‌చార్జ్‌గా ఉన్నారని వైద్య సిబ్బంది చెబుతున్నారు. ఇప్పటికైనా యునాని వైద్యుడిని నియమించి వైద్యాన్ని అందుబాటులోకి తేవాలని మండల ప్రజలు కోరుతున్నారు

#### యునాని వైద్యం అందించాలి



ప్రభుత్వం యునాని వైద్యాన్ని ప్రజలకు అందేలా చూడాలి. యునాని వైద్యంతో రోగాలు నయమవుతాయి. ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు. ఔషధ మూలికలు కలిగిన యునాని వైద్యంతో ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఇలాంటి సంప్రదాయ వైద్యం పట్ల నిర్లక్ష్యం తగదు. ప్రభుత్వం స్పందించి రెగ్యులర్ డాక్టర్‌ను నియమించి వైద్యసేవలు కొనసాగించాలి.

- రాజారెడ్డి, గాండ్లపెంట




ఆయుష్ డిపార్ట్‌మెంట్ బోర్డు

#### మా పరిధిలోకి రాదు

ప్రభుత్వ ఆసుపత్రిలో ఆయుష్ విభాగం కోసం ఒక గదిని కేటాయించారు. అందులో యునాని వైద్యులు రోగులకు సేవలు అందించాలి. యునాని డాక్టర్ మా పరిధిలో ఉండరు. వారి విధులు, రోగులకు అందించే చికిత్స వివరాలు మాకు తెలియదు.

- డాక్టర్ మహేశ్వర్ మారుతి, పీహెచ్‌సీ వైద్యాధికారి, గాండ్లపెంట

# కొనేవారేరీ..?

- సాగుకే ప్రభుత్వాల ప్రోత్సాహం
- పంట దిగుబడి అమ్ముకోలేక రైతుల అవస్థ
- అన్నదాతలను ఆదుకోకపోతే గుణపాఠం తప్పదు
- జిల్లా మహాసభలో రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి




గార్లదిన్నెలో ర్యాలీ చేస్తున్న రైతు సంఘం నాయకులు

గార్లదిన్నె, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యాన పంటల సాగుకు ఇస్తున్న ప్రోత్సాహం పంటల కొనుగోలుకు ఇవ్వడం లేదని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి ధ్వజమెత్తారు. రైతు సంఘం జిల్లా 13వ మహాసభలను గురువారం గార్లదిన్నె బస్టాండ్ సర్కిల్లో నిర్వహించారు. ఈ మహాసభలకు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు రాంభూపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు తరిమెల నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షులు బీహెచ్ రాయుడు, శివారెడ్డి, చెన్నారెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తొలుత స్థానిక ప్రభుత్వ కార్యాలయం నుంచి బహిరంగ సభ వరకు ర్యాలీగా వచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడారు. గిట్టుబాటు ధర, మార్కెటింగ్ సౌకర్యం లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఉద్యాన పంటల సాగులో అహర్నిశలు శ్రమించిన రైతులంటే మధ్యవర్తులకే ఎక్కువలాభం చేకూరుతోందన్నారు. తక్కువ ధరకు రైతువద్ద కొనుగోలు చేసి, ఇతర దేశాలకు ఉద్యాన పంటలను ఎగుమతి చేసి కార్పొరేట్ సంస్థలు కోట్లు గడిస్తున్నాయన్నారు. ఓట్ల కోసమే ప్రభుత్వాలు అరకొరగా అన్నదాతలకు ప్రోత్సాహకాలు అందిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం మొక్కజొన్న క్వింటాకు రూ. 2400 మద్దతు ధర ప్రకటించినా, కొనుగోలు కేంద్రాలు ఎక్కడ కనిపించలేదన్నారు. అరటిని కొనేవారు లేక రైతుల పరిస్థితి దుర్భరంగా మారినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. చీనీ, బొప్పాయి ఇలా అనేక పండ్లతోటలు సాగుచేసిన రైతులు గిట్టుబాటు ధరలేక ఆర్థికంగా నష్టపోయి అప్పులపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిస్థితుల మార్పు కోసం రాజకీయాలకు అతీతంగా రైతులు, కార్మికులు ఏకమై ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం సహాయ కార్యదర్శులు మధుసూదన్, వీరుపాక్షి, రాజారామిరెడ్డి, చెన్నారెడ్డి, బాలరంగయ్య, నాగమ్మ, రాము, ఆచారీ తదితరులు పాల్గొన్నారు.

# చేతులెట్లా వచ్చాయ్ మామా..!

**బాలుడిని చంపేసిన మేనమామ**

**నమ్మించి తీసుకెళ్లి గొంతు నులిమేశాడు**

కదిరి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న తన కుమారుడి వైద్యానికి తగినంత ఆర్థికసాయం చేయలేదనే కోపం..! 'ఎక్కడ చూపించినా నీ కొడుక్కు నయం కాదు..' అని అన్నాడన్న బాధ..! ఇంకా ఏవేవో కారణాలు..! బావ మీద ఉన్న కోపాన్ని తన మేనల్లుడిపై చూపించాడు. పసివాడిని తీసుకువెళ్లి గొంతు నులిమి చంపేశాడు. తలుపుల మండలంలో సొంత మేనల్లుడిని మేనమామ దారుణంగా చంపేశాడు. ఈ ఘటన ఆ కుటుంబ సభ్యులతోపాటు గ్రామస్థులను కంటతడి పెట్టిస్తోంది. తలుపుల మండలం గరికపల్లికి చెందిన హర్షవర్ధన్(5) హత్యను జీర్ణించుకోలేకపోతున్నారు.



పోలీసుల సమక్షంలో నిందితుడు ప్రసాద్, బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్థులు

### ప్రేమ నటించి..

నిందితుడు ప్రసాద్ స్వస్థలం నంబులపూలకుంట మండలంలోని బందారుచెట్లపల్లి. ప్రస్తుతం కదిరి మున్సిపాలిటీ పరిధిలోని మూర్తిపల్లిలో ఉంటున్నాడు. తలుపుల మండలం గరికపల్లికి చెందిన గంగాధర్‌తో ప్రసాద్ చెల్లెలు చంద్రకళకు వివాహం జరిగింది. వీరికి కూతురు మోక్షిత, కుమారుడు హర్షవర్ధన్ ఉన్నారు. బావపై లోలోన ఉన్న కోపాన్ని కక్షగా మార్చుకున్నాడు. విచక్షణ కోల్పోయి దారుణమైన ప్రణాళిక వేసుకున్నాడు. మేనల్లుడిని చంపడానికి రెండు నెలల ముందు నుంచే వ్యూహాత్మకంగా అడుగులు



చిన్నారి మృతదేహం వద్ద పోలీసులు

వేశాడు. చెల్లెలి ఇంటికి తరుచూ వచ్చిపోతూ.. మేనల్లుడికి చిరు తిండ్లు కొనిపెడుతూ దగ్గరయ్యాడు. మామ అంటే చచ్చిపడేంత ప్రేమను పసివాడు పెంచుకునేలా చేశాడు. అదను చూసి అటవీ ప్రాంతానికి తీసుకువెళ్లి హత్య చేశాడు.

### బావ లేని సమయంలో..

తన బావ గంగాధర్ ఇంటి వద్ద లేడని నిర్ధారించుకున్న ప్రసాద్, బుధవారం ఉదయం 11గంటలకు వారి ఇంటికి వచ్చాడు. అంగన్‌వాడీ స్కూల్‌కు వెళ్లిన మేనల్లుడిని ఇంటికి పిలిపించుకున్నాడు. బైక్‌పై ఎక్కించుకుని, తోట వద్ద ఉన్న తన బావ గంగాధర్ వద్దకు తీసుకెళ్లాడు. తిరిగి 12గంటలకు ఇంటికి వచ్చారు. చెల్లెలు చంద్రకళ, మేనకోడలు మోక్షితతో మాట్లాడి, హర్షన్‌వర్ధన్‌కు రూ.20 ఇచ్చి, అంగడికి పంపించాడు. పది నిమిషాల తరువాత తిరుగు ప్రయాణమై, హర్షవర్ధన్ వెంట పడుతున్నాడని తిరిగి ఇంటి వద్దకు తీసుకువచ్చి వదిలిపెట్టాడు. చంద్రకళ తన కుమారుడిని ఆడుకోమని చెప్పి బయటకు పంపగానే, ప్రసాద్ వ్యూహాత్మకంగా బయటకు వెళ్లి.. మేనల్లుడిని బైక్‌పై ఎక్కించుకుని వెళ్లిపోయాడు. మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో బాలుడు అదృశ్యమైనట్లు గుర్తించారు. ప్రసాద్ వెంట వెళ్లి ఉంటాడనే అనుమానంతో ఫోన్ చేసినా, బుకాయించాడు. బాలుడిని చంపేసి, ఏమీ ఎరుగనట్లు మధ్యాహ్నం 3 గంటలకు తిరిగి వచ్చి, వెతుకుతున్నట్లు నటించాడు. విషయం తెలుసుకున్న గంగాధర్, తోట వద్ద నుంచి వచ్చి కొడుకు కోసం గాలించాడు. సాయంత్రం 6గంటలకు తలుపుల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు ప్రసాద్‌ను అనుమానించి అదుపులోకి తీసుకున్నారు. దీంతో దారుణ హత్య జరిగిన విషయం బయటపడింది.

### కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు



తమ ముద్దుల కొడుకు మృతదేహాన్ని అటవీ ప్రాంతంలో చూసిన తల్లిదండ్రులు గుండెలవిసేలా విలపించారు. మేనమామే హత్య చేస్తే ఎవరికి చెప్పుకోవాలని కన్నీరుమున్నీరయ్యారు. పోలీసులు గురువారం తెల్లవారుజామునే మృతదేహాన్ని గుర్తించినా, ఆధారాలను సేకరించేందుకు, పంచనామా కోసం సాయంత్రం వరకు మృతదేహాన్ని అక్కడే ఉంచారు. ఆ తరువాత మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## జిల్లాకు 792 కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లు

- ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ సురేష్



వివరాలు వెల్లడిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ సురేష్

అనంతపురం న్యూటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాకి 792 కమ్యూనిటీ శానిటరి కాంపెక్స్‌లు మంజూరయ్యాయనీ, వాటి నిర్మాణాలు చేపడుతున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్ గురువారం తెలిపారు. తన చాంబర్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. సచివాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గురుకుల పాఠశాలలు, సాంఘిక సంక్షేమ వసతి గృహాలు, ఆస్పత్రులు, దేవాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద స్వచ్ఛభారత్ గ్రామీణ్ కింద కమ్యూనిటీ శానిటరరీ కాంప్లెక్స్‌ల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నామన్నారు. రూ.3 లక్షల వ్యయంతో ఒక్కొక్కటి నిర్మిస్తున్నామన్నారు. జిల్లాకి 792 మంజూరయ్యాయనీ, ఇప్పటికే పలు ప్రాంతాల్లో దాదాపు 350 పూర్తయ్యాయన్నారు. మిగిలిన వాటిని త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. మరో 200 ప్రాంతాల్లో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లు అవసరమని గుర్తించామన్నారు. ఆ మేరకు అంచనాలను ఉన్నతాధికారులకు పంపుతున్నామన్నారు. అనుమతులు రాగానే వాటిని కూడా ప్రారంభిస్తామన్నారు.

## 25.91 శాతం ఓటరు మ్యాపింగ్ పూర్తి

- వీసీలో కలెక్టర్



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

అనంతపురం కలెక్టరేట్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఓటరు మ్యాపింగ్ 25.91 శాతం పూర్తి చేసినట్లు కలెక్టర్ ఆనంద్ తెలిపారు. గురువారం విజయవాడ నుంచి ఎలక్టోరల్ ఇంటెన్సివ్ రివిజన్-2026 కోసం సన్నాహక కార్యకలాపాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ సమీక్షించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ఆనంద్, డీఆర్వో మలోల, ఎన్నికల విభాగా డిప్యూటీ తహసీల్దార్ కనకరాజ్ తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో ఓటరు మ్యాపింగ్‌ను పూర్తి చేయడంపై దృష్టి సారించామన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన 330 పోలింగ్ కేంద్రాలకు బీఎల్‌ఓల నియామకానికి ప్రతిపాదనలు వెంటనే పంపిస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగ సీనియర్ అసిస్టెంట్ శామ్యూల్, టెక్నికల్ అసిస్టెంట్ శివ పాల్గొన్నారు.

## రామకోటి రాస్తే మేలు

- వైసీపీపై మండిపడ్డ బీజేపీ నాయకుడు దేవానంద్



మాట్లాడుతున్న గుడిసె దేవానంద్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలల పీపీపీ విధానంపై వైసీపీ నాయకులు కోటి సంతకాల సేకరణ బదులు రామకోటి రాస్తే మేలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుడిసె దేవానంద్ ఎద్దేవా చేశారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలోనే తన తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మెడికల్ కళాశాలల్లో పీపీపీ విధానం తీసుకువచ్చారనే విషయం జగన్ తెలుసుకోవాలని హితవు పలికారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో పీపీపీ విధానంపై రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ బహిరంగ చర్చకు సవాల్ విసిరారని, దాన్ని స్వీకరించే దమ్ము జగన్‌కు లేదన్నారు. తాడేపల్లి ప్యాలెస్, బెంగళూరు వైట్‌హౌస్‌కే పరిమితమైన జగన్ మిడిమిడి జ్ఞానంతో వీకెండ్‌లో అలా వచ్చి ఏదో మాట్లాడేసి ఇలా వెళ్లిపోతారని విమర్శించారు. పంటలకు బీమా ప్రీమియం చెల్లించకుండా అన్నదాతలను నిలువునా మోసం చేసిన ఘనత వైసీపీదే అని విమర్శించారు. పరకామణి చోరీ కేసులో నిజాలు వెలుగు చూస్తాయనే సీఐ సతీష్‌ను హత్య చేశారని ఆరోపించారు. తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి కలిపి భక్తుల మనో భావాలని దెబ్బతీశారన్నారు. ఇక జీవితంలో ముఖ్యమంత్రి పదవి రాదనే విషయాన్ని జగన్ గుర్తెరిగి మసలుకోవాలని హితవు పలికారు.

## సానుకూల ప్రజాదృక్పథం మరింత మెరుగవ్వాలి: కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మహిళలపై నేరాలు తగ్గించడం, పారిశుధ్యం, అన్న క్యాంటీన్ల నిర్వహణలో మరింత పురోగతి తీసుకురావడం ద్వారా ప్రజాసానుకూల దృక్పథాన్ని మరింత మెరుగు పరచాలని కలెక్టర్ ఆనంద్.. అధికారులను ఆదేశించారు. ఏపీ సచివాలయంలోని సీఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి గురువారం వరి ధాన్యం సేకరణ, సానుకూల ప్రజాదృక్పథం, ఏజెంట్ స్పేస్ కోసం డాక్యుమెంట్ అప్‌లోడ్, రియల్ టైమ్ గవర్నెన్స్, సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలలు తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి వీసీలో కలెక్టర్ ఆనంద్, సంబంధిత అధికారులతో కలిసి పాల్గొన్నారు. వీసీ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... ఆర్టీజీఎస్ జరగనున్న నేపథ్యంలో కీ పెర్ఫార్మెన్స్, ఏజెంట్ స్పేస్ డాక్యుమెంట్ల అప్‌లోడ్‌లో మరింత పురోగతి, వినియోగం తీసుకురావాలన్నారు. సంక్షేమ వసతిగృహాలు, గురుకుల పాఠశాలల్లో రక్షిత మంచినీరు అందుబాటులో ఉండేలా ఆర్‌ఓ ప్లాంట్ల ఏర్పాటు, నిర్వహణపై దృష్టి పెట్టాలన్నారు. ఆహార కల్తీ, డయేరియా సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తగా పర్యవేక్షణ ఉండాలని సూచించారు. వీసీలో డీఎం డబ్ల్యూఓ రామసుబ్బారెడ్డి, బీసీ సంక్షేమ డీడీ కుష్బూకొఠారి, డీఐపీఆర్‌ఓ బాలకొండయ్య, డీఎస్పీ మహబూబ్‌బాషా, నగరపాలక డిప్యూటీ కమిషనర్ పావని, ఈఈ షాకీర్ పాల్గొన్నారు.

# ఎక్కడికెళ్లారో.. ఏమయ్యారో..?

## ఉమ్మడి జిల్లాలో ఐదుగురి అదృశ్యం

**ఉమ్మడి జిల్లాల్లో ముగ్గురు విద్యార్థులు, ఓ మహిళ, మరో వ్యక్తి అదృశ్యం అయినట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. సోమందేపల్లి మండలంలో డిగ్రీ విద్యార్థిని, కూడేరు మండలంలో 8వ తరగతి బాలుడు, గోరంట్ల మండలంలో ఇంటర్ విద్యార్థి, గుత్తి ఆర్ఎస్‌లో మహిళ, తనకల్లు మండలంలో ఓ వ్యక్తి అదృశ్యం అయినట్లు ఆయా పోలీస్‌స్టేషన్లకు ఫిర్యాదులు అందాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.**

### సర్టిఫికెట్లు తెచ్చుకుంటానని వెళ్లి..

సోమందేపల్లి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేతగానిచెరువు గ్రామానికి చెందిన యువతి చాందిని అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్ గురువారం తెలిపారు. కేతగానిచెరువుకు చెందిన షేక్ మహ్మద్ కుమార్తె చాందిని హిందూపురంలోని సప్తగిరి కళాశాలలో డిగ్రీ ఫైనల్‌ఇయర్ చదువుతోందన్నారు. కళాశాల నుంచి సర్టిఫికెట్లు తెచ్చుకుంటానని ఇంట్లో చెప్పి బుధవారం ఉదయం బయటకు వచ్చింది. ఆమె తిరిగి ఇంటికి రాకపోవడంతో పలుచోట్ల గాలించి ఆమె తండ్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడన్నారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### దత్తత తెచ్చుకుంటే ...



జిమ్మీ (ఫైల్)

కూడేరు(ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రహ్మణపల్లి గ్రామానికి చెందిన జిమ్మీ అనే 13 సంవత్సరాల బాలుడు అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. జిమ్మీని రెండున్నరేళ్ల కిందట మధ్యప్రదేశ్‌లోని బాలసదన్ నుంచి బ్రహ్మణపల్లి గ్రామానికి చెందిన శివారెడ్డి దంపతులు దత్తత తెచ్చుకున్నారు. ప్రస్తుతం బాలుడు ఓ కార్పొరేట్ స్కూల్లో 8వ తరగతి చదువుతున్నాడు. ఈనెల 25న పాఠశాలకు వెళ్తానని చెప్పి వెళ్లిన బాలుడు తిరిగి ఇంటికి రాకపోవడంతో తండ్రి శివారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

### ఆధార్ అప్‌డేట్ కోసం వచ్చి...



పవన్‌కుమార్

గోరంట్ల(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరావులపల్లికి చెందిన ఇంటర్ విద్యార్థి పవన్‌కుమార్‌రెడ్డి అదృశ్యమైనట్లు గురువారం కేసు నమోదు చేశామని సీఐ శేఖర్ తెలిపారు. మండలంలోని కరావులపల్లికి చెందిన ఉమామహేశ్వర్‌రెడ్డి కుమారుడు పవన్‌కుమార్‌రెడ్డి అనంతపురంలోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఆధార్ అప్‌డేట్ కోసం స్వగ్రామానికి వచ్చాడు. ఈనెల 24న కళాశాలకు వెళ్తానని చెప్పి వెళ్లిన విద్యార్థి అప్పటి నుంచి కనిపించడంలేదు. కళాశాల యజమాన్యం రాలేదని తెలపడంతో, బంధువులు, స్నేహితుల ఇళ్లలో గాలించారు. ప్రయోజనం లేకపోవడంతో తల్లి సుభాషిని పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### గుత్తి ఆర్ఎస్‌లో మహిళ



విజయలక్ష్మి

గుత్తి(ఆంధ్రజ్యోతి): గుత్తి ఆర్ఎస్‌కు చెందిన విజయలక్ష్మి అదృశ్యం అయినట్లు గురువారం కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. గుత్తిఆర్ఎస్ సుద్ద ఫ్యాక్టరీ ఏరియాలో విజయలక్ష్మి నివాసముంటున్నారు. బుధవారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### బయటకు వెళ్లి..



రమేష్

తనకల్లు(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముండ్లవారిపల్లికి చెందిన రమేష్ కనిపించడంలేదని అతడి భార్య వెన్నెల గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రమేష్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. చికిత్స తీసుకుంటున్నాడు. బుధవారం కొక్కంటి క్రాస్‌కు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లిన రమేష్ తిరిగి రాలేదని అతడి భార్య ఫిర్యాదు చేసింది. ఆ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# మరో రెండు రోజులు గడువు

**పూర్తి సమాచారం అప్‌డేట్ చేయకుంటే చర్యలు తప్పవు**

- డిప్యూటీ ఎంపీడీఓలకు పీఆర్ కమిషనర్ హెచ్చరిక
- కంబదూరు పంచాయతీ కార్యదర్శి అశ్వత్థరెడ్డి సస్పెన్షన్

అనంతపురం న్యూటౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని డిప్యూటీ ఎంపీడీఓలకు మరో రెండురోజులు గడువు ఇస్తున్నామనీ, స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో ఇంటి యజమానికి సంబంధించిన కచ్చితమైన సమాచారం నమోదు చేయాలని పంచాయతీరాజ్ కమిషనర్ క్రిష్ణతేజ ఆదేశించారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కమిషనర్ కార్యాలయం నుంచి అన్నిజిల్లాల పంచాయతీ అధికారులు, డీడీఓలు, డిప్యూటీ ఎంపీడీఓలతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా పంచాయతీ వనరులకేంద్రంలోని సమావేశ భవనం నుంచి డీపీఓ నాగరాజనాయుడు, డీడీఓ నాగశివలీలతోపాటు డిప్యూటీ ఎంపీడీఓలు, స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో వివరాల నమోదులో వెనుకబడిన కార్యదర్శులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. ఉదయం 10 గంటలకు మొదలైన సమావేశానికి 11.30 గంటలైనా కొందరు హాజరుకాలేదు. కంబదూరు పంచాయతీకి సంబంధించి కార్యదర్శి అశ్వత్థరెడ్డి స్వర్ణపంచాయతీ పోర్టల్‌లో వివరాల నమోదులో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో కమిషనర్ మొదట్లోనే సమీక్షించారు. అప్పటికి కార్యదర్శి సమావేశానికి హాజరుకాకపోవడంతో డిప్యూటీ ఎంపీడీఓ లీలాబాయితో సమస్యకు కారణాలను ఆరాతీశారు. అప్పుడే వచ్చిన పంచాయతీ కార్యదర్శి అశ్వత్థరెడ్డితో మాట్లాడించే ప్రయత్నం చేశారు. వివరాల నమోదులో పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కమిషనర్ సీరియస్ అయ్యారు. వెంటనే సదరు కార్యాదర్శిని సస్పెండ్ చేయాలని డీపీఓ నాగరాజనాయుడుకు ఆదేశించారు. అనంతరం డిప్యూటీ ఎంపీడీఓలు డీడీఓలు, డీపీఓలతో కమిషనర్.. స్వమిత్వ, ఇంటి పన్నులు, స్వర్ణపంచాయతీలో వివరాల నమోదుపై పలు ఆదేశాలు జారీచేశారు. అందుకు అనుగుణంగా శనివారం లోపు పూర్తిచేయాలనీ, లేదంటే డిప్యూటీ ఎంపీడీఓలే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు.



వీసీలో పాల్గొన్న డీపీఓ, డీడీఓ, డిప్యూటీ ఎంపీడీఓలు

### సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ

కంబదూరు పంచాయతీ కార్యాదర్శి అశ్వత్థరెడ్డిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఆనంద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకుగాను పంచాయతీ రాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేసినట్లు డిపీఓ నాగరాజనాయుడు తెలిపారు. స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో హౌస్ ట్యాక్స్ వివారాల నమోదులో 3,714 ఇళ్ల యజమానులకు ఒకే ఫోన్ నంబరు నమోదు చేసినట్లు అధికారులు గుర్తించారు. దీనిని సీరియస్‌గా పరిగణించిన కమిషనర్ కృష్ణతేజ పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేయాలని ఆదేశించారు. ఆ మేరకు గ్రేడ్-3 కార్యదర్శి అశ్వత్థరెడ్డిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

# నేటితో ఆఖరు

**ముగియనున్న హౌసింగ్ సర్వే**

**పెండింగ్‌లో 7వేల కుటుంబాలు**

**ఆందోళనలో ఆయా వర్గాలు**

అనంతపురం వైద్యం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): నూతన ఇళ్ల నిర్మాణాల కోసం రాష్ట్ర ప్రభుత్వ చేపట్టిన హౌసింగ్ సర్వే శుక్రవారంతో ముగియనుంది. ఈనెల 10నుంచి 30వరకు రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో సర్వేను చేపట్టారు. అయితే సర్వే పూర్తి చేసిన కుటుంబాల వివరాలను ఆన్‌లైన్ చేయడానికి హౌసింగ్ డిపార్ట్‌మెంట్ అధికారులు రెండు రోజుల ముందే సర్వే ప్రక్రియను నిలిపివేశారు. గురువారం 31వేల కుటుంబాలను సర్వే చేశారు. ఇంకా 7వేలకు పైగా కుటుంబాలను సర్వేచేయాల్సి ఉంది. దీంతో ఇళ్లులేని బాధిత కుటుంబాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ సర్వేలో పాల్గొన్న వారికే ఇళ్లు మంజూరు అవుతాయని, లేకుంటే మరో నాలుగేళ్ల వరకు ఆగాల్సిందేనని వాపోతున్నారు.

### 8 డివిజన్లు ఏడు వేల కుటుంబాలు

జిల్లాలో అనంతపురం, రాప్తాడు, శింగనమల, తాడిపత్రి, గుంతకల్లు, ఉరవకొండ, కళ్యాణదుర్గం, రాయదుర్గం మొత్తం ఎనిమిది సబ్ డివిజన్లుగా విభజించారు. వీటి పరిధిలో 7వేలకు పైగా కుటుంబాలను కొత్త ఇంటి కోసం సర్వే చేయాల్సి ఉంది. బ్రహ్మసముద్రం, శెట్టూరు, కుందుర్పి, కళ్యాణదుర్గం, కణేకల్లు, రాయదుర్గం, బొమ్మనహాళ్, పామిడి, నార్పల, బెళుగుప్ప, శింగనమల, పుట్లూరు, పెద్దవడుగూరు, గార్లదిన్నె తదితర మండలాల్లో సర్వే పూర్తికాలేదు. 18రోజులు మాత్రమే గడువు విధించడంతో సర్వే పూర్తికాలేదని క్షేత్రస్థాయి సిబ్బంది చెబుతున్నారు.

### నిబంధనలు ఇలా..

మూడు, నాలుగు చక్రాల వాహనాలు కలిగిన వారు, మూడు, నాలుగు చక్రాలు కల్గిన వ్యవసాయ యంత్రాలు ఉన్నవారు. రూ.5వేలకుపైగా కిసాన్ క్రెడిట్ కార్డు వాడినవారు, ప్రభుత్వ ఉద్యోగం ఉన్నవారు, గుర్తింపు పొందిన వ్యవసాయ పారిశ్రామిక వేత్త, 2.5 ఎకరాలకుపైగా నీటి పారులదల కలిగిన భూమి ఉన్నవారు, ఐదెకరాలకు పైగా వ్యవసాయేటర భూమి ఉన్నవారు ప్రభుత్వ గృహం పొందేందుకు అనర్హులుగా ప్రభుత్వం నిర్ణయించింది. 60 సంవత్సరాలు పైబడిన వారికి ఇళ్లను మంజూరు చేయమని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

### ప్రభుత్వ నిర్దేశం మేరకు

ప్రభుత్వ నిర్దేశం మేరకు హౌసింగ్ సర్వేచేపట్టాం. ఇప్పటివరకు 31వేల కుటుంబాలను సర్వే చేశాం. మరో 7వేలకు పైగా కుటుంబాలు పెండింగ్‌లో ఉన్నాయి. సర్వే చేసిన కుటుంబాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి చెక్ చేయాలి. లేకుంటే అర్హులకు ఇళ్లు మంజూరుకావు. 28కి గడువు విధించాం. మిగిలిన రెండు రోజుల్లోనూ సర్వేచేయాలని సిబ్బందిని ఆదేశించాం. గడువు పొడిగిస్తే పూర్తిస్థాయిలో సర్వే చేయవచ్చు.



- శైలజ, జిల్లా గృహనిర్మాణ సంస్థ అధికారిణి

# అయ్యో..! ఇంత ఘోరమా..!

- తల్లీకొడుకు అనుమానాస్పద మృతి
- ఉరికి వేలాడిన తల్లి.. రక్తపు మడుగులో పసివాడు
- మృతులు రామగిరి డీటీ భార్య, కుమారుడు
- దంపతుల మధ్య విభేదాలే కారణమా..?
- దర్యాప్తు చేస్తున్న వన్‌టౌన్ పోలీసులు

అనంతపురం క్రైం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని శారదా నగర్‌లో రామగిరి డిప్యూటీ తహసీల్దారు సతీమణి అమూల్య(30), కుమారుడు సహర్ష(3) అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. పసివాడు గొంతు తెగి రక్తపు మడుగులో పడి ఉండగా, అమూల్య ఉరికి వేలాడుతూ ప్రాణాలు కోల్పోయారు. దంపతుల మధ్య మనస్పర్థల కారణంగా ఈ సంఘటన జరిగినట్లు భావిస్తున్నారు. జీవితంపై విరక్తి చెందిన అమూల్య, కుమారుడి గొంతుకోసి, ఉరి వేసుకుని ఉంటారని అంటున్నారు. కానీ ఆమె నోట్లో గుడ్డలు కుక్కి ఉండటం అనుమానాలకు తావిస్తోంది. అనంతపురం వన్‌టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. రవికుమార్‌కు కర్నూలుకు చెందిన రామకృష్ణ, రమాదేవి దంపతుల కూతురు అమూల్యను ఇచ్చి ఐదేళ్ల కిందట వివాహం జరిపించారు. అమూల్య బీటెక్ వరకూ చదువుకున్నారు. వీరికి సహర్ష ఒక్కడే కుమారుడు. అనంతపురం జేఎన్‌టీయూ రోడ్డులోని రిషితేజ అపార్టుమెంట్ 303 ఫ్లాట్‌లో నివాసం ఉంటున్నారు.

### రవి ఇంటికి వచ్చేలోగా..

దంపతుల మధ్య కొంతకాలంగా మనస్పర్థలు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో గురువారం సాయంత్రం 6.30 గంటలకు విధులు ముగించుకుని ఇంటికి వచ్చిన రవి కుమార్, తలుపు కొట్టారు. భార్య స్పందించకపోవడంతో అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు, పక్క ఫ్లాట్‌లవారి సహకారంతో తలుపులు పగులగొట్టి ఇంట్లోకి వెళ్లి చూశారు. అప్పటికే అమూల్య ఓ బెడ్‌రూమ్‌లో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని కనిపించారు. రెండో బెడ్ రూమ్‌లో చిన్నారి సహర్ష రక్తపు మడుగులో కనిపించాడు. చిన్నారి గొంతును చాకుతో కోశారు. ఆ పక్కనే రక్తం అంటిన చాకు కనిపించింది. ఉరికి వేలాడుతున్న అమూల్య నోట్లో గుడ్డలు కుక్కి ఉండటం అనుమానాలకు తావిస్తోంది. ఇది ఆత్మహత్యేనా..? ఏదైనా సంఘటన జరిగిందా..? అని పోలీసులు విచారిస్తున్నారు. భార్య, కుమారుడి మృతదేహాలను చూసి రవికుమార్ కన్నీటిపర్యంతమయ్యారు. పోలీసులు ఆయనను విచారిస్తున్నారు. అనంతపురం డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ వెంకటేశ్వర్లు సంఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. అమూల్య భర్తను విచారించామని, ఆమె తల్లిదండ్రులు ఇచ్చే సమాచారం ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని డీఎస్పీ తెలిపారు.

### అనేక అనుమానాలు

అమూల్య, సహర్ష మృతిపై అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. రెండు రోజుల కిందట దంపతుల మధ్య వాగ్వాదం జరిగినట్లు సమాచారం. అమూల్యను ఆమె తల్లి



రవికుమార్‌ను విచారిస్తున్న పోలీసులు

రెండు రోజుల కిందట కర్నూలు నుంచి తీసుకొచ్చి ఇంట్లో దిగబెట్టినట్లు తెలిసింది. ఆ సమయంలో కూడా రవికి, అమూల్యకు మధ్య గొడవ జరిగినట్లు సమాచారం. ఈ క్రమంలో అమూల్యపై రవి చెయ్యి చేసుకున్నాడని అంటున్నారు. రవికి కట్నకానుకలు భారీగా ఇచ్చారని వారి బంధువులు అంటున్నారు. వీరి కాపురం కొన్నాళ్లు బాగానే సాగిందని, ఆ తర్వాత వేధింపులు మొదలయ్యాయని అంటున్నారు. ఈ కారణంగానే అమూల్య ఇలా చేసుకుని ఉంటుందా అనే అనుమానాలు తలెత్తుతున్నాయి.

### కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు

జరిగిన ఘోరం గురించి సమాచారం అందుకున్న అమూల్య తల్లిదండ్రులు గురువారం రాత్రి 11 గంటల సమయంలో అనంతపురానికి చేరుకున్నారు. తమ కూతురు, మనవడి మరణాన్ని జీర్ణించుకోలేక గుండె పగిలేలా విలపించారు. అమూల్య బంధువులు పలువురు వారి వెంట వచ్చి కన్నీటి పర్యంతం అయ్యారు. 'అదనపు కట్నం కోసం వేధించాడు. పెద్ద ఇల్లు కట్టుకోవాలంట.. పెద్దమనుషుల సమక్షంలో పలుమార్లు పంచాయితీలు జరిగాయి.. అయినా ఘోరం జరిగిపోయింది.' అని వారు విలపించారు. రవి వేధింపుల కారణంగానే అమూల్య తన కొడుకును చంపేసి ఆత్మహత్య చేసుకుందని ఆరోపించారు.

## సెల్‌ఫోన్ చూడొద్దన్నందుకు ఆత్మహత్య


భానుతేజ (ఫైల్)

హిందూపురం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ పక్కనపెట్టి బాగా చదువుకోవాలని దండించినందుకు క్షణికావేశంతో విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. టూటౌన్ ఏఎస్ఐ జయలత తెలిపిన మేరకు సత్యనారాయణపేటలో నివాసమున్న యర్రగడ్ల వ్యాపారి నర్సింహులు నాలుగోకుమార్తె భానుతేజ(19) ఓ కళాశాలలో బీబీఏ మొదటి సంవత్సరం చదువుతోంది. తరచూ సెల్‌ఫోన్ చూస్తుండటంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో 'మిమ్మల్ని ఏడిపిస్తాను చూడండి' అంటూ బుధవారం రాత్రి ఇంటి పై అంతస్తులోకి వెళ్లి చీరతో ఉరి వేసుకుంది. ఆందోళనతో కుటుంబ సభ్యులు తలుపులు తీయమన్నా తీయలేదు. దీంతో తలుపులు పగలకొట్టి లోనికి వెళ్లి ఉరికి వేలాడుతున్న భానుతేజను కిందకు దించి ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ విషయంపై గురువారం పోలీసులకు సమాచారం వెళ్లడంతో ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## వృద్ధురాలిపై దాడి

పరిస్థితి విషమం

గోరంట్ల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుత్తివారిపల్లికి చెందిన 70 ఏళ్ల గొల్లరామక్కపై గుర్తు తెలియని వ్యక్తి దాడిచేసి, తీవ్రంగా గాయపరిచాడు. వృద్ధురాలి కోడలు శాంతమ్మ తెలిపిన మేరకు గుత్తివారిపల్లిలో శంకరప్ప, శాంతమ్మ దంపతులతోపాటు శంకరప్ప తల్లి రామక్క నివాసముంటున్నారు. గురువారం మధ్యాహ్నం రామక్క ఇంటి ఎదుట కూర్చుని ఉండగా గుర్తుతెలియని వ్యక్తి కట్టెతో తలపై కొట్టి ఇంటిలోకి ప్రవేశించాడు. ఇది గమనించని కోడలు శాంతమ్మ ఇంటిలోకి వెళ్తుండగా లోపలున్న వ్యక్తి శాంతమ్మ మెడలోని బంగారు గుళ్లు కలిగిన పూసలదండను లాగాడు. దండ తెగి పూసలు నేలపై పడ్డాయి. శాంతమ్మ గట్టిగా కేకలు వేయడంతో గుర్తు తెలియని వ్యక్తి పరారైనట్లు చెప్పారు. దాడిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గాయపడిన రామక్క పరిస్థితి విషమంగా ఉండటంతో గోరంట్ల నుంచి హిందూపురం ఆసుపత్రికి తరలించారు.

## ద్విచక్ర వాహనాలు ఢీ.. యువకుడి మృతి

హిందూపురం, నవంబరు27(ఆంధ్రజ్యోతి): మండలంలోని బెంగళూరు ప్రధాన రహదారిపై అప్పులకుంట గేటు సమీపంలో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందగా మరో ఇద్దరు గాయపడినట్లు అప్‌గ్రేడ్ స్టేషన్ ఏఎస్ఐ సురేష్ తెలిపారు. ఆయన తెలిపిన మేరకు బుధవారం ఉదయం పూలకుంటకు చెందిన ఉప్పర ఆంజనేయులు కుమారుడు ఉప్పర హనుమంతు(19) ద్విచక్రవాహనంపై హిందూపురం నుంచి బెంగళూరుకు బయల్దేరాడు. అప్పులకుంట గేటు దాటాక ఎదురుగా వస్తున్న గోళ్లాపురానికి చెందిన రమేష్ దంపతుల ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నాడు. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. రమేష్ దంపతులు గాయపడ్డారు. దట్టమైన పొగమంచు కారణంగా ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని గుర్తించలేకపోయాడని పోలీసులు తెలిపారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఏఎస్ఐ సురేష్ తెలిపారు. మృతిచెందిన యువకుడు బెంగళూరులోని టీవీ టవర్స్‌లో కార్మికుడిగా పని చేస్తున్నాడు. తల్లిదండ్రులు బెంగళూరులో సెక్యూరిటీగార్డులుగా పని చేస్తున్నారు.

### అనంతలో ఒకరు..

అనంతపురం క్రైం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): నగరంలోని సైఫుల్లా ఫ్లైఓవర్‌పై బుధవారం అర్ధరాత్రి బైక్ ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. మరో యువకుడి పరిస్థితి విషమంగా ఉంది. ట్రాఫిక్, త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాజీవ్ కాలనీకి చెందిన షేక్ అబ్దుల్ రెహమాన్, ఖసీఫ్ బుధవారం అర్ధరాత్రి ద్విచక్రవాహనంలో ఫ్లైఓవర్‌పై అతివేగంగా వెళ్తూ ప్రహరీని ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు. బైక్ నడుపుతున్న షేక్ అబ్దుల్ రెహమాన్‌కు ముఖం, తల భాగాల్లో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు.. వారిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అబ్దుల్ మరణించాడు. ఖసీఫ్‌ను మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## రేపు జాబ్ మేళా

నార్పల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా నార్పల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డేవిడ్ గురువారం ప్రకటనలో తెలిపారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, సీడాప్ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్ మేళాలో పది జాతీయ కంపెనీలతో పాటు, మల్టీనేషనల్ కంపెనీలు పాల్గొంటాయని చెప్పారు. శనివారం ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జరిగే జాబ్ మేళాకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, పీజీ చదివిన విద్యార్థులు అర్హులన్నారు. అభ్యర్థులు వెబ్‌సైట్‌లో ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వివరాలకు 9010039901 నంబరులో సంప్రదించాలన్నారు.

## అద్దె వాహనం కోసం కొటేషన్ల ఆహ్వానం

పుట్టపర్తిరూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మిషన్ శక్తి పథకంలో భాగంగా జిల్లాలో వన్‌స్టాప్ సెంటర్ ఉపయోగానికి సంబంధించి అద్దెవాహనం నడపడానికి అర్హుల నుంచి షీల్డ్ కొటేషన్లు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ పీడీ ప్రమీల గురువారం ప్రకటనలో తెలిపారు. ట్రావెల్స్ యాజమానులు, సంస్థలు కారు అద్దెకు నడపాల్సి ఉంటుందన్నారు. షీల్డ్ కొటేషన్లను డిసెంబరు 1 నుంచి 3వ తేదీలోపు ఆఫీసు పనివేళల్లో నిర్ణీతబాక్స్‌లో వన్‌స్టాప్, అపోజిట్ కలెక్టర్ క్యాంపు బంగ్లా, మెయిన్‌రోడ్డు పుట్టపర్తి చిరునామాలో సమర్పించాల్సి ఉంటుందని పీడీ తెలిపారు. వివరాలకు 6302309552 నంబరులో సంప్రదించాలన్నారు.

## ఫెన్సింగ్‌లో జిల్లాకు పతకాల పంట


విజేతలను అభినందిస్తున్న ఎస్‌జీఎఫ్, అసోసియేషన్ సభ్యులు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో జిల్లాకు పతకాల పంట పండింది. కొనసీమ జిల్లాలో బుధవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-17 ఫెన్సింగ్ పోటీల బాలుర విభాగంతో జిల్లాకి చెందిన రియాన్ సూరజ్, గౌతమ్, కార్తీక్, చరణ్, దర్శన్, హర్షవర్ధన్, వసంత్ పతకాలు సాధించారు. బాలికల విభాగంలో వందన, అంజనా మనోజ్ఞ, మానస, సురేఖ, ఎం నందిని, అంకిత, విజయలక్ష్మి, కే నందిని పతకాలు కొల్లగొట్టారు. విజేతలను స్కూల్‌గేమ్స్ కార్యదర్శులు శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, శకుంతల, సుహాసిని, ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీకృష్ణ, శాప్ కోచ్ ప్రతాప్, పీడీలు చంద్రశేఖర్, రవికుమార్ అభినందించారు.

## గుంతకల్లు మీదుగా ప్రత్యేక రైలు

గుంతకల్లు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా బిలాస్‌పూర్-యల్హంక మధ్య (వయా గుంతకల్లు) డిసెంబరులో ప్రత్యేక వీక్లీ రైలు నడపనున్నట్లు రైల్వే అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బిలాస్‌పూర్-యల్హంక ప్రత్యేక వీక్లీ రైలు (08261) డిసెంబరు 2 నుంచి 30 వరకూ ఐదు మంగళవారాలలో ఉదయం 11 గంటలకు బయలుదేరి మరుసటిరోజు సా యంత్రం ఆరున్నరకు యల్హంకకు చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు ప్రత్యేక వీక్లీ రైలు (08262) డిసెంబరు 3 నుంచి 31 వరకూ ఐదు బుధవారాలలో రాత్రి 9 గంటలకు యల్హంకలో బయలుదేరి శుక్రవారం ఉదయం నాలుగున్నర కు బిలాస్‌పూర్‌కు చేరుకుంటుందన్నారు. ఈ రైలు భాటాపుర, రాయపూర్, దుర్గ్, రాజ్‌నంద్‌గావ్, డోంగర్‌ఘర్, గోండియా, వాడ్సా, చందా ఫోర్ట్, బాలార్షా, సిర్పూర్ కాగజ్‌నగర్, మంచిర్యాల, ఖాజీపేట్, చర్లపల్లి, సికింద్రాబాద్, లింగంపల్లి, వికారాబా ద్, తాండూరు, యాద్గిర్, క్రిష్ణా, రాయచూరు, మంత్రాలయం రోడ్డు, గుంతకల్లు, గుత్తి, అనంతపురం, ధర్మవరం స్టేషన్ల మీదుగా యల్హంకకు చేరుకుంటుందన్నారు.

## టమోటా కిలో రూ.40

అనంతపురం రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్లో గురువారం టమోటాలు కిలో గరిష్ఠంగా రూ.40తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.20తో, సరసరిగా రూ.27తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 1950 టన్నుల టమోటాలు వచ్చినట్లు చెప్పారు.

# నేటి నుంచి బడి బస్సుల తనిఖీ

నిబంధనలు పాటించని వాటిని సీజ్ చేయండి

వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర కమిషనర్ ఆదేశం

అనంతపురం టౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రవాణాశాఖ నిబంధనలు పాటించని విద్యాసంస్థల బస్సులపై శుక్రవారం నుంచి రవాణాశాఖ అధికారులు కొరడా ఝుళిపించనున్నారు. వరుస బస్సు ప్రమాదాల నేపథ్యంలో ప్రైవేటు స్కూల్ బస్సుల భద్రతపై రవాణాశాఖ అధికారులతో గురువారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆ శాఖ రాష్ట్ర కమిషనర్ మనీష్‌కుమార్ సిన్హా చర్చించారు. విద్యాసంస్థల బస్సులకు ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్, ట్యాక్స్, పర్మిట్ ఏవి లేకున్నా కేసు నమోదు చేయాలనీ, అవసరమైతే సీజ్ చేయాలని ఆదేశించారు. బస్సు డ్రైవర్లకు లైసెన్సు లేనిపక్షంలో కేసు నమోదు చేసి, సదరు విద్యాసంస్థ యాజమాన్యాన్ని హెచ్చరించాలన్నారు. వాహనానికి సంబంధించి ఫైర్ అలారం సిస్టమ్, ఎమర్జెన్సీ డోర్లు, అగ్ని ప్రమాద నియంత్రణ పరికరాలు లేకుంటే వెంటనే సవరించుకునేలా ఆదేశించాలన్నారు. శుక్రవారం నుంచి రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యాసంస్థల బస్సుల తనిఖీ చేపట్టాలన్నారు. ఏ ఒక్క బస్సునూ మినహాయించకూడదని ఆదేశించారు. రాష్ట్ర కమిషనర్ ఆదేశాలతో జిల్లా రవాణా శాఖ అధికారులు విద్యాసంస్థల బస్సుల తనిఖీలకు సమాయత్తమయ్యారు. జిల్లావ్యాప్తంగా 800 విద్యాసంస్థల బస్సులున్నాయి. శుక్రవారం నుంచి వాటిని తనిఖీ చేయనున్నట్లు రవాణాశాఖ జిల్లా ఉపకమిషనర్ వీర్రాజు వెల్లడించారు. నిబంధనలు పాటించని బస్సులను సీజ్ చేయాలని సిబ్బందిని ఆదేశించినట్లు తెలిపారు.

# రైతు ఆదాయం పెంచడమే ధ్యేయం

పీఎం ధన్ ధాన్య కృషి యోజన కేంద్ర నోడల్ అధికారి సుజాతాశర్మ


మాట్లాడుతున్న సుజాతాశర్మ

అనంతపురం కలెక్టరేట్, నవంబరు27(ఆంధ్రజ్యోతి): రైతుల ఆదాయం పెంచడమే ధ్యేయమని ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన కేంద్ర నోడల్ అధికారి సుజాతాశర్మ పేర్కొన్నారు. ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషియోజన అమలుపై గురువారం కలెక్టరేట్‌లో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో కలెక్టర్ ఆనంద్, జేసీ శివనారాయణశర్మతో కలిసి కేంద్ర నోడల్ అధికారి సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ... రైతు ఆదాయం పెంచే దిశగా వచ్చే ఆరేళ్లకు ప్రణాళిక రూపొందించాలన్నారు. ప్రధానమంతి ధన్ ధాన్య కృషి యోజన పరిధిలో 11 శాఖలకు సంబంధించి 36 పథకాలు అమలవుతుండగా.. వ్యవసాయ, ఉద్యాన, అనుబంధ శాఖల అధికారులు సమన్వయంతో వాటిని విజయవంతం చేయాలన్నారు. ఉద్యాన పంటల సాగు, ఉత్పత్తి పెంచడంపై రైతులకు శిక్షణ ఇవ్వాలన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారించేలా చూడాలన్నారు. కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ... ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన అమలుకు సంబంధించి వ్యవసాయ, అనుబంధ శాఖలపై వివరాలను సమగ్రంగా తెలియజేశారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఉమామహేశ్వరమ్మ, ఉద్యాన శాఖ డీడీ ఉమాదేవి, సీపీఓ అశోక్‌కుమార్, ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి, పశుసంవర్ధక శాఖ జేడీ ప్రేమ్‌చంద్ పాల్గొన్నారు.

### పంటల పరిశీలన

రాప్తాడు(ఆంధ్రజ్యోతి): మండలంలోని హంపాపురం, రామినేపల్లి పరిధిలో రైతులు సాగుచేసిన పంటలను ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషియోజన కేంద్ర నోడల్ అధికారి సుజాతాశర్మ పరిశీలించారు. ఆయా గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న పంటలను పరిశీలించారు. సాగు వివరాలు, పంటల దిగుబడి, సేంద్రియ వ్యవసాయ పద్ధతులు, సమగ్ర సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులు, దిగుబడి కోసం పాటించాల్సిన పద్ధతులపై రైతులతో ఆరాతీశారు. నోడల్ అధికారి సుజాతాశరమ్మ మాట్లాడుతూ.. రైతులు ఎఫ్‌పీఓ గ్రూపులను ఏర్పాటు చేసుకోవడం ద్వారా తమ పంటల మార్కెటింగ్ సులభతరం చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో జేసీ శివనారాయణ శర్మ, జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ, హార్టికల్చర్ డీడీ ఉమాదేవి, ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి, కేవీకే శాస్త్రవేత్త మల్లీశ్వరి పాల్గొన్నారు.

## 180 మామిడిచెట్ల నరికివేత


నరికేసిన మామిడి చెట్టును చూపుతున్న రామ్మోహన్ రెడ్డి

ధర్మవరంరూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముచ్చురామి గ్రామంలో రైతు రామ్మోహన్ రెడ్డి సాగుచేసిన రెండేళ్ల వయసున్న 180 మామిడిచెట్లను గుర్తుతెలియని వ్యక్తులు నరికేశారు. గురువారం బాధిత రైతు మాట్లాడుతూ.. రెండున్నర ఎకరాల్లో మామిడిచెట్లు సాగుచేశానన్నారు. బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు.. వాటిని నరికేశారన్నారు. ఆరునెలల క్రితం కూడా 80చెట్లు నరికేశారనీ, అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేస్తే పొలానికి వచ్చి పరిశీలించారే తప్ప.. ఇంతవరకు చర్యలు తీసుకోలేదన్నారు. మళ్లీ నరికేయడంతో తీవ్రంగా నష్టపోయానని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. రెండేళ్లుగా బాధిత రైతుకు, మరొకరితో భూవివాదం నడుస్తున్నట్లు సమాచారం. రూరల్ పోలీసులు విచారణ చేపట్టారు.

### చీనీ టన్ను రూ.22వేలు

అనంతపురం రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): అనంత వ్యవసాయ మార్కెట్లో గురువారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.22వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి ధర రూ.16వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 20టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

## విద్యార్థులకు ఉపయోగపడేలా సిలబస్

● ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ అనిత

అనంతపురంరూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఉపయోగపడేలా డిగ్రీ సిలబస్ ఉండాలని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ అనిత పేర్కొన్నారు. సీడీసీ డీన్ ఆచార్య రామగోపాల్ అధ్యక్షతన వర్సిటీ పరిధిలోని అన్ని డిగ్రీ కళాశాలలకు సంబంధించిన నూతన సిలబస్(2025-26) అప్రూవల్ కొరకు ఎస్కేయూలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమానికి వీసీ హాజరయ్యారు. నూతన సిలబస్‌ను ఆమోదించిన తర్వాత ఆమె మాట్లాడుతూ.. ఏపీఎస్‌సీహెచ్‌ఈ, రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేలా నూతన సిలబస్ రూపకల్పన చేశాయన్నారు. భవిష్యత్తులో ప్రతి విభాగానికి చెందిన చైర్మన్, అధ్యాపకులు డిగ్రీ సిలబస్‌ను విద్యార్థులకు ఉపయోగపడేలా రూపొందించాలని సూచించారు. ముఖ్యంగా పరిశ్రమలకు అనుసంధానంగా సిలబస్ రూపకల్పన చేయాలని సూచించారు. కార్యక్రమంలో అన్ని అనుబంధ కళాశాలలకు సంబంధించిన బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్లు, మెంబర్స్ వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్ శ్రీరాములునాయక్, ఆచార్య మునినారాయణప్ప పాల్గొన్నారు.

## గొర్రెల వ్యాపారి మోసంపై ఫిర్యాదు

ధర్మవరం రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఓ వ్యాపారి తమ వందలాది గొర్రెలు కొని, డబ్బులు ఇవ్వకుండా టోకరా వేశాడని మండలంలోని కత్తేకొట్టాలకు చెందిన గొర్రెల యాజమానులు కాటమయ్య, ఉజ్జినప్ప, మరికొంతమంది బాధితులు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ధర్మవరంలోని ఇందిరమ్మకాలనీకి చెందిన వ్యాపారి మాబు, అతడి కుటుంబసభ్యులు తమ గ్రామానికి వచ్చి గొర్రెలు కొనుగోలు చేశారన్నారు. కొంత అడ్వాన్స్ కూడా ఇచ్చారన్నారు. పది మంది గొర్రెల యజమానుల నుంచి వందల్లో గొర్రెలు కొనుగోలు చేసి, తరలించుకుపోయారని తెలిపారు. అడ్వాన్స్‌పోగా మిగిలిన సొమ్ము వారానికి ఇస్తానని చెప్పాడన్నారు. వారాలు గడిచినా ఫోన్ ఎత్తకుండా, పరారు కావడంతో దిక్కుతోచక రూరల్ పోలీసులను ఆశ్రయించినట్లు తెలిపారు. వ్యాపారి మాబుపై చర్యలు తీసుకుని తమకు రావాల్సిన లక్షల రూపాయలను ఇప్పించాలని బాధితులు ఫిర్యాదు చేశారు.

పోలీసుల నిర్లక్ష్యం..

# విద్యార్థిని ఆత్మహత్యాయత్నం!

వేధింపులపై ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని మనస్తాపం

ఉరి వేసుకున్న బాలిక.. పరిస్థితి విషమం

చెన్నేకొత్తపల్లి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): వేధించడమే కాక, అందరూ చూస్తుండగానే దాడి చేశాడని పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదనే మనస్తాపంతో ఓ ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యకు యత్నించిన సంఘటన మండలంలోని ఓ గ్రామంలో గురువారం జరిగింది. స్థానికులు, బంధువులు తెలిపిన మేరకు మండలంలోని ఓ గ్రామానికి చెందిన విద్యార్థిని, ఇదే మండలంలోని మరో గ్రామానికి చెందిన విద్యార్థి ధర్మవరంలో వేర్వేరు కాలేజీల్లో ఇంటర్ సెకెండియర్ చదువుతున్నారు. కాలేజీకి వెళ్లి వచ్చే క్రమంలో రెండురోజుల కిందట బస్సులో ఆ విద్యార్థినితో అసభ్యకరంగా ప్రవర్తించాడు. మరుసటి రోజు కూడా తన వైఖరిలో ఏమాత్రం మార్పులేదు. దీంతో బస్సులో అతడి చేష్టలను విద్యార్థిని సెల్‌ఫోన్‌లో రికార్డు చేసింది. ఈక్రమంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. సహనం కోల్పోయిన విద్యార్థి దుర్భాషలాడుతూ విద్యార్థినిపై విచక్షణారహితంగా దాడి చేశాడు. ధర్మవరంలో బస్సుదిగి కాలేజీకి వెళుతున్న సందర్భంలోనూ మరోసారి దాడి చేశాడు. దీంతో ఆ విద్యార్థిని పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి జరిగిన సంఘటనను తెలిపింది. చెన్నేకొత్తపల్లి పరిధిలో జరిగింది కాబట్టి అక్కడికి వెళ్లి ఫిర్యాదు చేయాలని పోలీసులు చెప్పి పంపించారు. దీంతో విద్యార్థిని తల్లిదండ్రులతో కలిసి బుధవారం చెన్నేకొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసింది. ఆ విద్యార్థిని పిలిపించి దండిస్తామని పోలీసులు ఒకింత తేలికగా చెప్పినట్లు సమాచారం. తమ ఫిర్యాదుపై పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని మనస్తాపం చెందిన విద్యార్థిని ఇంటిలో ఎవరూలేని సమయంలో ఉరేసుకుంది. గమనించిన కుటుంబసభ్యులు ఆమెను ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. విద్యార్థిని ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ధర్మవరం, చెన్నేకొత్తపల్లి పోలీసుల నిర్లక్ష్యంతోనే ఆ విద్యార్థిని ఆత్మహత్యకు యత్నించినట్లు స్థానికులు, బంధువులు ఆరోపిస్తున్నారు.

# శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహిద్దాం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్

అనంతపురం విద్య, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సీపీఐ శతాబ్ది ఉత్సవాలను డిసెంబరు 10న అనంతలో ఘనంగా నిర్వహిద్దామని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని వీకే మెమోరియల్ హాల్‌లో పార్టీ జనరల్ బాడీ సమావేశం నగర అధ్యక్షుడు శ్రీరాములు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జగదీష్ మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల ప్రయాణం ఒక అపూర్వ పోరాటగాథ అన్నారు. ప్రజాసమస్యలే అజెండాగా అన్నివర్గాల హక్కుల కోసం సీపీఐ నడిపిన పోరాటాలు చరిత్రలో నిలిచిపోయాయన్నారు. సీపీఐ పోరాటంలో కీలక బలగం, బలం పార్టీ శ్రేణులే అన్నారు. అదే స్ఫూర్తితో శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మరో అతిథి సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి మాట్లాడుతూ కేంద్రం, రాష్ట్రంలో పాలన ప్రజల అంచనాలకు విరుద్ధంగా సాగుతోందని మండిపడ్డారు. అన్నివర్గాలు అనేక సమస్యలతో సతమతమవుతున్నాయన్నారు. ప్రజల కోసం మన పోరాటాలను మరింత ముందుకు తీసుకుపోవాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో సీపీఐ నాయకులు లింగమయ్య, సంతోష్ కుమార్, రాజేష్‌గౌడు, అల్లీపీరా, ఎల్లుట్ల నారాయణస్వామి, బాషా తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జగదీష్

## తానా పోటీలకు తిమ్మాపురం విద్యార్థినులు


శైలజ


జయశ్రీ

గుంతకల్లుటౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తానా ఆధ్వర్యంలో నిర్వహించే అంతర్జాతీయ బాలల పోటీలకు మండలంలోని తిమ్మాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థినులు జయశ్రీ, శైలజ ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం నారాయణరెడ్డి గురువారం తెలిపారు. ఉత్తర అమెరికా తెలుగు సంఘం తానా ప్రతిష్ఠాత్మకంగా నవంబరు 30 వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బాలలకు ఈ పోటీలు నిర్వహిస్తోందన్నారు. అన్ని విభాగాలలో 101 మంది విద్యార్థులు పాల్గొంటారన్నారు. తమ పాఠశాల విద్యార్థులు కథలు చెప్పే ఒకటో విభాగం పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. తమ పాఠశాల నుంచి విద్యార్థినులకు అరుదైన అవకాశం కల్పించిన తానా అధ్యక్షుడు డాక్టర్ నరేన్ కొడదాలి, ప్రపంచ సాహిత్య వేదిక నిర్వాహకులు డాక్టర్ తోటకూర ప్రసాద్, సమన్వయకర్త చిగురుమళ్ల శ్రీనివాసులకు ఈ సందర్భంగా హెచ్‌ఎం, తెలుగు ఉపాధ్యాయుడు దాసరి చంద్రమోహన్ ధన్యవాదాలు తెలిపారు.

## సూపర్ స్పెషాలిటీకి వైద్యులను నియమించాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప



అనంతపురం టౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి వైద్యులను నియమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ... సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి సంబంధించి 17 విభాగాలకుగాను 68 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా.. 31 మంది మాత్రమే పని చేస్తున్నారన్నారు. అనస్థీసియా, కార్డియాలజీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ, రేడియాలజీ, ఎమర్జెన్సీ మెడిసిన్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ వంటి కీలక విభాగాలకు వైద్యులు లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న వైద్యులపై పనిభారం పెరుగుతోందని తెలిపారు. సర్వజనాస్పత్రి, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులకు నిధులను పెంచాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న డాక్టర్ పోస్టులను వెంటనే భర్తీ చేయడంతోపాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. లేనిపక్షంలో ప్రజాసంఘాలను కలుపుకుని ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

## రూ.7500తో అరటి కొనుగోలు

తాడిపత్రి ఉద్యానశాఖ అధికారి ఉమాదేవి


అరటి విక్రయాలను పరిశీలిస్తున్న ఉమాదేవి

యాడికి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అరటి పంటలో రెండో దిగుబడిని టన్ను రూ.7500కు ఐఎన్ఐ, కమల్ ట్రేడర్స్ వారు కొనుగోలు చేస్తున్నట్లు తాడిపత్రి ఉద్యానశాఖ అధికారి ఉమాదేవి తెలిపారు. మండలంలోని రాయలచెరువు, చందన, లక్షుంపల్లి గ్రామాల్లో అరటి రెండో పంట హార్వెస్టింగ్ జరుగుతున్న తోటలను గురువారం ఆమె పరిశీలించారు. అరటిపంట ప్రస్తుతం లోకల్ ట్రేడర్స్ కిలో ఐదు నుంచి ఆరు రూపాయలకు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. చందన గ్రామంలో అరటి నాణ్యత పెంపుదలపై అవగాహన కల్పించారు. అరటిలో వచ్చే సిగటోక తెగులు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు సూచనలు ఇచ్చారు. తోటలో కలుపు లేకుండా జాగ్రత్త తీసుకోవాలని, నీటి పారుదల వ్యవస్థను మెరుగుపరచుకోవాలని తెలిపారు. తెగులు వ్యాప్తి మొదలైనప్పుడు తగు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో చందన వీహెచ్‌ఏ జయలక్ష్మి, రాయలచెరువు వీఏఏ పవన్ పాల్గొన్నారు.

## ఆస్పత్రిలో నవజాత శిశువు మృతి


వన్‌టౌన్ సీఐ రాజగోపాల్‌తో మాట్లాడుతున్న కుటుంబ సభ్యులు, ఇన్‌సెట్‌లో మృతిచెందిన చిన్నారి

హిందూపురం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో మూడురోజుల వయసున్న నవజాత శిశువు గురువారం మృతిచెందాడు. పట్టణంలోని మోడల్ కాలనీకి చెందిన సందీప్ భార్య దివ్యశ్రీ ఈనెల 25న పురిటి నొప్పులతో ఆస్పత్రికెళ్లింది. పరీక్షించిన వైద్యులు ఆపరేషన్ చేశారు. మగబిడ్డ జన్మించాడు. చిన్నపిల్లల వైద్యులకు బిడ్డను చూపించాలని తెలిపారు. ఎక్కువగా ఏడుస్తుండటంతో చూపించారు. గురువారం ఆస్పత్రిలో అడ్మిషన్‌లో ఉండగానే బిడ్డ చనిపోయాడు. వైద్యుల నిర్లక్ష్యమే ఇందుకు కారణమని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ సీఐ రాజగోపాల్‌నాయుడు అక్కడకు చేరుకుని, బిడ్డ తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదు తీసుకున్నారు. విచారించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీనిపై ఆస్పత్రి వైద్యులను వివరణ కోరగా.. వైద్య సేవల్లో నిర్లక్ష్యం చేయలేదన్నారు. తల్లి వద్ద పాలు లేకపోవడంతో బయటి నుంచి తెచ్చి తాపుతున్నారని తెలిపారు.

## దరఖాస్తుల ఆహ్వానం

బుక్కపట్నం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బ్యూటీషియన్, ఎంబ్రాయిడరీ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి హరికృష్ణ గురువారం తెలిపారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో కస్టమర్ కేర్, ఎగ్జిక్యూటివ్ వాయిస్, నాన్‌వాయిస్, టూరిజం, ఆతిథ్యం కోర్సులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ కోర్సులను మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. మూడు నెలల వ్యవధి కలిగిన ఈ కోర్సుకు ఆసక్తిగల యువత తమ ఆధార్‌లింక్ కలిగిన మొబైల్ నెంబరుతో స్కిల్ హబ్ కోఆర్డినేటర్ (7981541994)ను సంప్రదించాలని కోరారు.

న్యూస్ బాక్స్

## పీజీఆర్ఎస్ ఫిర్యాదుల పరిశీలన



ఫిర్యాదిదారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ మహేశ్

ముదిగుబ్బ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం ఆర్డీఓ మహేష్ పర్యటించారు. పీజీఆర్ఎస్‌లో అందిన ఫిర్యాదులపై పరిశీలన నిమిత్తం ఆయన మండలంలోని నాగారెడ్డిపల్లి, దొరిగల్లు, తిమ్మనాయునిపాళ్యం, ముదిగుబ్బ మండల కేంద్రంలోని కస్తూర్బా కాలనీలలో పర్యటించారు. నేరుగా ఫిర్యాదుదారులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హౌసింగ్ రీసర్వే, ప్రభుత్వ పథకాలపై వివరాలు అడిగి తెలుసు కున్నారు. పీజీఆర్ఎస్‌లో అందించే అర్జీలను త్వరగతిగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నారాయణ స్వామి, ఎంపీడీఓ శకుంతల, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలపరిధిలోని కొడవండ్లపల్లి సమీపంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లు, రెండు టిప్పర్లను ఆర్డీఓ పట్టుకున్నారు. వాటిని పోలీస్ శాఖకు అప్పగించారు.

## రస్తా సౌకర్యం కల్పించాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ముద్దన్నగారిపల్లి వాసులు

గాండ్లపెంట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని ముద్దన్నగారిపల్లి నుంచి కటారుపల్లికి వెళ్లేందుకు రస్తా సౌకర్యం కల్పించాలని ముద్దన్నగారిపల్లి గ్రామస్థులు కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బాబా రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ముద్దన్నగారిపల్లి నుంచి కటారుపల్లికి రస్తా ఉండేదని, కొందరు దానికి ఆక్రమించుకున్నారని తెలి పారు. దీంతో దోరణాల, ముద్దన్నగారిపల్లి గ్రామస్థులు సచివాలయ పనుల నిమిత్తం కటారుపల్లికి వెళ్లాలంటే రస్తా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. సర్వే చేయించి గతంలో ఉన్న రస్తాను చూపిస్తే తాము రహదారి ఏర్పాటు చేసుకుంటామని గ్రామస్థులు తహసీల్దార్‌కు తెలిపారు. ఈ విషయంపై తహసీల్దార్ స్పందిస్తూ రస్తా ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## పశువులకు ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం

బత్తలపల్లి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని రాఘవంపల్లిలో గురువారం రాష్ట్రీయ గోకుల్ మిషన్, ఆంధ్రప్రదేశ్ లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ ఆధ్వర్యంలో పాడి పశువులకు ఉచిత గర్భకోశ చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. పశు సంవర్థక శాఖ ఈఓ వెంకటేశు గ్రామంలోని గర్భకోశ వ్యాధులు ఉన్న ఆవులకు చికిత్సలు చేశారు. ఈ ఉచిత వైద్య శిబిరం ద్వారా పశుసంవర్థక రంగం అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఆయన తెలిపారు. పశువులు వ్యాధుల బారిన పడకుండా ఆధునిక పద్ధతులపై అవగాహన కల్పించారు. అలాగే ఉపాధి హామీ ద్వారా పశుగ్రాసం పెంచుకోవచ్చని సూచించారు. సమతుల ఆహార, ఖనిజ మిశ్రమాలను సమానంగా ఇస్తే పశువులు ఆరోగ్యాంగా ఉండి పాల దిగుబడి బాగా ఉంటుందని తెలిపారు. అనంతరం పాడి ఆవుల కోసం రైతులకు మినరల్ మిక్చర్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏడీ పద్మనాభం, వైద్యాధికారులు గురునాథ్ రెడ్డి, యూనిస్ తదితరులు పాల్గొన్నారు.

## అనాథలకు నిత్యావసరాల పంపిణీ

అమడగూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గాజులపల్లి వద్ద ఉన్న శ్రీమాతృశ్రీ వృద్ధాశ్రమంలో ఉన్న అనాథలకు ఓబుళదేవరచెరువు శ్రీవిజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ మస్తాన్, ఉపాధ్యాయులు గురువారం నిత్యావసర సరుకులు, దుప్పట్లు పంపి ణీ చేశారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమం నిర్వాహకురాలు అరుణ జ్యోతి మాట్లాడుతూ సహాయ దినోత్సవం సందర్భంగా ఆశ్రమంలో ఉన్న 26 మందికి నిత్యావసర సరుకులు, బియ్యం, పండ్లు, బిస్కెట్లు, దుప్పట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. అనాథలకు సహాయం అందించిన శ్రీవిజ్ఞాన్ విద్యాసంస్థల ఉపాధ్యాయులు, చైర్మన్‌కు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు.

## టీడీపీ నాయకుడికి పరామర్శ

ముదిగుబ్బ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాగులగుబ్బల గ్రామానికి చెందిన టీడీపీ దొరిగల్లు పంచాయతీ అధ్యక్షుడు సూర్యశేఖర్‌రాజును గురువారం ఆ పార్టీ మండల నాయకులు పరామర్శించారు. ఆయనకు రెండురోజుల క్రితం ప్రమాదవశాత్తు కాలు విరిగింది. ఈ నేపథ్యంలో టీడీపీ మండల కన్వీనర్ కరణం ప్రభాకర్ ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. టీడీపీ నాయకులు మహబూబ్‌పీరా, కిష్టప్ప, రాశిపల్లి నారాయణ స్వామి, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## అపరిశుభ్రంగా కూరగాయల మార్కెట్

● అసహనం వ్యక్తం చేస్తున్న ప్రజలు



మార్కెట్‌లో అపరిశుభ్రత

ధర్మవరం రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కూరగాయాల మార్కెట్‌లో అపరిశుభ్రత తాండవిస్తోంది. కుళ్లిన కూరగాయాలు, చెత్తాచెదారాన్ని మార్కెట్ యార్డులో ఎక్కడపడితే అక్కడ వేయడంతో దుర్వాసన వెదజల్లుతోంది. మార్కెట్‌యార్డులో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం పైభాగంలో ఉంది. ఈ కార్యాలయానికి నిత్యం ప్రజలు వివిధ అవసరాల నిమిత్తం వె ళుతుంటారు. కింద అంతా అపరిశుభ్రంగా ఉండడంతో మార్కెట్‌కు వచ్చే ప్రజలతో పాటు, సబ్‌రిస్ట్రార్ కార్యాలయానికి వచ్చే ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. చెత్తాచెదారం, కుళ్లినకూరగాయాలు వేయడంతో దుర్వాసన రావడంతో కార్యాలయం వచ్చే ప్రజలు ముక్కుమూసుకుని పోవాల్సి పరిస్థితి వచ్చింది. ప్రజలు తినే కూర గాయాల మార్కెట్‌లో ఇలా అపరిశుభ్రంగా ఉంటే రోగాలు రావా అంటూ మండిపడుతున్నారు. కనీసం రెండుమూడు రోజుల కొక సారి అయినా మార్కెట్‌నుశుభ్రం చేయకపోతే ఎలా అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు స్పందించి కూరగాయాల మార్కెట్‌ను పరిశుభ్రంగా ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.



ఫుట్‌పాత్‌పై వెలసిన దుకాణాలు, వస్తువులు కొనుగోలు చేస్తున్న భక్తులు

## జోరుగా ఫుట్‌పాత్ వ్యాపారం

పుట్టపర్తి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సత్యసాయి శతజయంతి వేడుకల్లో పాల్గొన్న భక్తుల కోసం పుట్టపర్తి పట్టణంలోని ఫుట్‌పాత్ మీద పలు దుకాణాలు వెలిశాయి. బెంగళూరు, చెన్నై ఇతర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు తాత్కాలికంగా ఫుట్‌పాత్‌పై దుకాణాలు ఏర్పాటుచేసుకున్నారు. శత జయంతి వేడుకల కోసం వచ్చిన భక్తులు ఫుట్‌పాత్‌పై వెలసిన దుకాణాల్లో కొనుగోలు చేస్తున్నారు. ప్రతి సంవత్సరం సత్యసాయి జయంతి వేడుకల్లో ఫుట్‌పాత వ్యాపారాలు వెలయడం ఆనవాయితీగా వస్తోంది. సదూర ప్రాంతాలకు వెళ్లి తెచ్చుకోవలసిన అవసరమైన వస్తువులు ఇక్కడే ఫుట్‌పాత్‌పై దొరకుతుండడంతో భక్తులు వాటిని కొనుగోలు చేస్తున్నారు. ఎక్కువగా ఫ్యాన్సీ, కాస్మొటిక్స్, చిన్నపిల్లల వస్తువులు, ఇంటికి అవసరమైన వంట సామాగ్రి వస్తువులతో పాటు బట్టలు తక్కువ ధరకే అన్నీ ఒకే ప్రాంతంలో దొరుకుతున్నాయి. దీంతో భక్తులు ఎగబడి వాటిని కొనుగోలు చేస్తున్నారు. తిరుగు ప్రయాణంలో పుట్టపర్తి నుంచి ఏమైనా గుర్తుగా తీసుకెళ్లాలని ఉత్సాహంతో కొనుగోలు చేస్తున్నట్లు పలువురు భక్తులు తెలుపుతున్నారు. దీంతో పుట్టపర్తిలో ఫుట్‌పాత్‌పై వెలసిన దుకాణాల్లో వ్యాపారం బాగా సాగుతోంది.

# రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● 'రైతన్నా.. మీకోసం'లో మాజీ మంత్రి పల్లె



రైతన్నా.. మీకోసంలో కరపత్రాలతో మాజీ మంత్రి పల్లె, నాయకులు

ఓబుళదేవరచెరువు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రైతుల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం 'రైతన్నా.. మీకోసం' కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని డబురువారిపల్లిలో గురువారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతన్నా మీ కోసం' నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ ద్వారా ఏటా రూ.20వేలు మంజూరు చేస్తున్నారని తెలిపారు. అందులో భాగంగా ఇప్పటికే ఈ సంవత్సరం రెండు విడతలుగా ఒక్కో రైతుకు రూ.14వేలు చొప్పున ఖాతాలో జమచేశారన్నారు. నియోజకవర్గంలోని అన్ని చెరువులను కృష్ణా జలాలతో నింపి ఆ ప్రాంతాలను సస్య శ్యామలం చేస్తామన్నారు. రైతులు సేంద్రీయ పద్ధతులలో వ్యవసాయాన్ని అవరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఇలియాజ్ అహ్మద్, టీడీపీ మండల కన్వీనర్ జయచంద్ర, నాయకులు అంజినప్ప, శివారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, జాకీర్ అహ్మద్, మాజీ సర్పంచ్ పొగాకు షఫీ, గ్రామ కమిటీ అధ్యక్షులు చంద్ర, గంగిరెడ్డి, మార్కెట్‌యార్డ్ డైరెక్టర్‌లు ప్రవీణ్ గోపినాథ్ రెడ్డి, జయచంద్రారెడ్డి, వీఏఏ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## ఈదులపల్లిలో 'రైతన్నా.. మీకోసం'



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు, నాయకులు

ముదిగుబ్బ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈదులపల్లిలో గురువారం 'రైతన్నా మీకోసం' కార్యక్రమం నిర్వహిం చారు. గ్రామ వ్యవసాయ సహాయకులు మనోజ్ ప్రభాకర్, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు గంగాధరరెడ్డి, లింగారెడ్డి, జయప్రతాప్‌రెడ్డి వ్యవసాయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు. వారు ఇంటింటికి వెళ్లి వ్యవసాయం, అనుబంధ శాఖల పథకాలను, ముఖ్య మంత్రి సందేశాన్ని రైతులకు చదివి వివరించారు.

## ఏజీపీగా న్యాయవాది సుబ్బారావు



ఏజీపీగా నియమితుడైన ఎంపీ సుబ్బారావు

ధర్మవరం రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీనియర్, జూనియర్ కోర్టుల ఏజీపీగా న్యాయవాది ఎంపీ సుబ్బారావును నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ఆయన ధర్మవరం కోర్టులో 26 సంవత్సరాలుగా న్యాయవాదిగా సివిల్, క్రిమినల్ కేసులు వాదిస్తున్నారు. ప్రభుత్వం సుబ్బారావును ఏజీపీగా నియమించడంతో ధర్మవరం న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

## హంతకుడిని కఠినంగా శిక్షించాలి

● సీపీఐ నాయకులు ● తలుపులలో కొవ్వొత్తులతో నిరసన



కొవ్వొత్తులతో సీపీఐ, అనుబంధ సంఘాల నాయకుల నిరసన

కదిరి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): అభం శుభం తెలియని బాలుడు హర్షవర్ధన్‌ను హత్య చేసి వారిని కఠినంగా శిక్షించాలని సీపీఐ, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం తలుపులలో కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి జగిలి ఈశ్వరయ్య మాట్లాడుతూ అభం శుభం తెలియని ఆ పసికందును హత్యచేయడం దారుణమన్నారు. హంతకుడిని అరెస్ట్‌చేసి జైల్లో పెట్టినా మళ్లీ కొద్దిరోజులకు బయటకు వచ్చి తన నేర సంస్కృతిని మానుకుంటాడని భరోసా లేదన్నారు. ప్రభుత్వం ఇలాంటి వారిని కఠినంగా శిక్షిస్తే, ఇలాంటి దుర్మార్గమైన చర్యలకు ఎవరూ పాల్పడరని అన్నారు. నేరస్థులకు ఇదొక గుణపాఠంగా మారాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు హుస్సేన్, సిద్దయ్య, ప్రజా సంఘం నాయకులు ఎద్దుల రాముడు, రవి, రాజశేఖర్, పవన్, అమర్‌నాథ్‌రెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డి, బాబావలి, డ్రైవర్ అసోసియేషన్ సభ్యులు, భవన కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## బాధితులకు మాజీ మంత్రి పరామర్శ



అస్వస్థతకు గురైన వారిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి పల్లె

ఓబుళదేవరచెరువు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలపరిధి లోని బత్తినపల్లిలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురై కోలుకుంటున్న బాధితులను మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి పరామర్శించారు. ఆయన గురువారం బత్తినపల్లిని సందర్శించారు. బాధితులకు అందిస్తున్న వైద్య సేవలపై వైద్యులు భానుప్రకాష్ నాయక్, కమల్ రోహిత్‌ను అడిగి తెలుసుకున్నారు. అందరూ ఆరోగ్యంగా ఉన్నారనీ, ఎవరికీ ఎలాంటి ప్రమాదంలేదని వైద్యులు ఆయనకు వివరించారు. అనంతరం రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మోహన్‌ను ఆయన పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. టీడీపీ మండల కన్వీనర్ శెట్టివారి జయచంద్ర, బీసీసెల్ నాయకులు అంజినప్ప, జాకీర్ అహ్మద్, కరుణాకర్‌రెడ్డి, శివారెడ్డి, జయచంద్రారెడ్డి, వల్లెపు సోమశేఖర్, గిరిజన సంఘం నాయకులు శ్రీనివాస్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు పనుల పరిశీలన

నల్లమాడ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని చౌటకుంటపల్లి వద్ద జరుగుతున్న తారురోడ్డు పనులను మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి గురువారం పరిశీలిం చారు. గుట్టలమయంగా ఉన్న ఈ రోడ్డు నిర్మాణానికి రూ.60లక్షల నిధులు మంజూరు కావడంతో పనులు జరుగుతున్నాయి. మాజీ మంత్రి పరిశీలించి, నాణ్యంగా రోడ్డు వేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. టీడీపీ నాయకులు చందనబాబు, పద్మనాభరెడ్డి, దస్తగిరి, వలి, గంగులప్ప తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ ఆదర్శ గ్రామానికి ఎంపిక



గ్రీన్ అంబాసిడర్‌లతో పంచాయతీల కార్యదర్శులు

అమడగూరు, నవంబరు27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో స్వచ్ఛ ఆదర్శ గ్రామంగా తీర్చి దిద్దేందుకు మండల అధికారులు మహమ్మదాబాద్ పంచాయతీని ఎంపిక చేసినట్లు ఈఓఆర్డీ రాజశేఖర్ తెలిపారు. దీంతో మండలంలోని అన్ని పంచాయతీల కార్యదర్శులు గురువారం మహ మ్మదాబాద్ గ్రామంలోని చెత్తతో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. చెత్తతో తయారుచేసి ఎరువులను పరిశీలించారు. స్వచ్ఛరథం కార్యక్రమంలో భాగంగా మహమ్మ దాబాద్‌ను ఆదర్శ గ్రామంగా ఎంపిక చేయడంతో... శుక్రవారం నుంచి 30 మంది గ్రీన్ అంబాసిడర్‌ల ద్వారా పంచాయతీలోని గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నట్లు పంచాయతీ కార్యదర్శి జానకి తెలిపారు. వీధుల్లో పేరుకుపోయిన చెత్త, మురుగు తొలగించి స్వచ్ఛ రథంగా నిలబడతామని ఆమె తెలిపారు. స్వచ్ఛ ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

## వేరుశనగ సాగులో నిమగ్నం



ఎర్రగుంటపల్లి వద్ద వేరుశనగ సాగుచేస్తున్న రైతులు

తనకల్లు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రబీ ప్రారంభం కాగానే ఎడతెరపి లేని వర్షాల కారణంగా రైతులు వ్యవసాయాన్ని ముందుకు సాగించలేకపోయారు. నాలుగురోజులుగా కొద్దిగా తెరపి రావడంతో రైతులు రబీ వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. డిసెంబరు 15వరకు వేరుశనగ విత్తడానికి అనుకూలంగా ఉండడంతో అందుకు వేరుశనగ సిద్ధంగా ఉన్న రైతులు వేరుశనగ విత్తనం వేయడంలో నిమగ్నమయ్యారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ కేంద్ర ప్రభుత్వం సహకారంతో రైతు సంఘాల ద్వారా జనజాగృతి ఆధ్వర్యంలో మండలపరిధిలోని రైతులకు విశిష్ట 1694 వేరుశనగ రకాన్ని గత ఖరీఫ్‌లో ఉచితంగా అందజేసింది. అప్పుడు సమయం దాటిపోవడంతో ఆ విత్తన కాయలు తీసుకున్న రైతు నేడు సాగుచేస్తున్నారు. ఈ యేడాది వర్షాల వల్ల బావులు, కుంటలు, చెరువుల్లోకి నీరు రావడంతో మండల వ్యాప్తం గా మూడువేల ఎకరాల్లో వేరుశనగ సాగుకు రైతులు ముందుకు వచ్చా రు. ఇప్పటికే ఐదువందల ఎకరాలపైగా వేరుశనగ సాగుచేసినట్లు రైతు ల అంచనా. వచ్చే మూడు, నాలుగురోజుల్లో మరో వెయ్యి ఎకరాల్లో సాగయ్యే అవకాశం ఉంది. డిసెంబరు 15నాటికి మూడు వేల ఎకరాల్లో సాగుచేసే అవకాశాలున్నట్లు రైతులు, అధికారులు లెక్కలేస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వం రైతు సంఘాల ద్వారా ఉచితంగా రైతులకు వేరుశనగ సరఫరా కూడా ప్రారంభించింది. ఈ యేడాది ఖరీఫ్‌లో తీవ్ర వర్షాభావం వల్ల వేరుశనగ సాగుచేయని రైతులు రబీలో సాగుకు సిద్ధమవుతున్నారు. మండలంలోని మల్లిరెడ్డిపల్లి, పెద్దపల్లి, మార్పురివాం డ్లపల్లి, ఎర్రగుంటపల్లి, గేమేనాయక్‌తండా, మొగిలిచెట్ల తండా, నడిమి కుంటపల్లి, కొత్తకురవపల్లి, వడ్డుమరవపల్లి, పోమేనాయక్ తండా, రామ్లా నాయక్‌తండా, రాగినేపల్లి, కురమాలపల్లి తదితర గ్రామా ల్లో వేరుశనగ సాగుచేస్తున్న రైతులకు మిశ్రమ పంటల సాగు కోసం విత్తనాలు ఉచితంగా అందజేస్తున్నట్లు జనసాగృతి వ్యవసాయ నిపుణు లు గరుడప్ప తెలిపారు. మిశ్రమ పంటల సాగువల్ల ప్రధాన పంట అయిన వేరుశనగకు చీడపీడల ఆశించవన్నారు. విత్తన శుద్ధి చేయించి రైతులతో మిశ్రమ పంటలు సాగుచేయడానికి కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## ఘనంగా అయ్యప్పస్వామి కన్నెపూజ



గణపతి హోమం చేస్తున్న పురోహితుడు సాయిస్వామి, గురుస్వామి పుట్టణ్ణ

పుట్టపర్తి రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలో హనుమాన్ దేవాలయంలో మొదటిసారి అయ్యప్ప మాలధారణ చేసిన వారు గురువారం కన్నెపూజను ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే గణపతి, నవగ్రహ పూజ, గణపతిహోమం చేశారు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, అయ్యప్పస్వాములకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. వేదమంత్రోచ్చారణ మధ్య కన్నెస్వాములు తెల్లవారుజామునే భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం మాలధారుల దీక్ష, అన్నదానం, సాయం త్రం అయ్యప్పస్వామి విగ్రహం ఊరేగింపు చేపట్టారు. దాతల సహకారం తో అంగరంగ వైభవంగా నిర్వహించినట్లు గురుస్వామి పుట్టణ్ణ తెలిపారు.

## నేడు ప్రజాదర్బార్

కదిరి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయం వద్ద ఉన్న మున్సిపల్ వాటర్ ట్యాంక్ ప్రాంగణంలో శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం నుంచి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10గంటల నుంచి కార్యక్రమం నిర్వహిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పాల్గొని ప్రజాసమస్యల గురించి చర్చిస్తారన్నారు. కదిరి పట్టణంలోని 4, 5, 6, 7, 8, 31 వార్డులకు సంబంధించిన సమస్యలను ప్రజలు స్వయంగా ఎమ్మెల్యేకి తెలువచ్చన్నా రు. ప్రజలు సమస్యలను అర్జీల రూపంలో అందజేయాలని, ఆధార్ కార్డు జిరాక్స్, ఫోన్ నెంబర్ అర్జీకి జత చేయాలని తెలిపారు. కార్యక్రమానికి వివిధ శాఖల అధికారులు పాల్గొంటారని తెలిపారు. ఈ అవకాశాన్ని ఆయావార్డు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## తహసీల్దార్ బదిలీ

నల్లచెరువు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ జమానుల్లాఖాన్‌ను బదిలీ చేస్తూ జిల్లా అధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టరేట్లో తహసీల్దార్ కొరత ఉండటంతో జమానుల్లాఖాన్‌ను కలెక్టరేట్లోని మెజిస్ట్రేయల్ సెక్షన్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా డిప్యూటీ తహసీల్దార్ రవినాయక్‌ను నియమించారు.

## ఆరోగ్యంపై శ్రద్ధ చూపండి: డీఎంహెచ్ఓ



రోగులతో విచారిస్తున్న డీఎంహెచ్ఓ ఫైరోజ్ బేగం

ఓబుళదేవరచెరువు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని, కావున ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని డీఎంహెచ్ఓ ఫైరోజ్ బేగం పేర్కొన్నారు. మండలంలోని బత్తినపల్లిని ఆమె గురువారం సందర్శించారు. రెండు రోజుల క్రితం కలుషి త ఆహారం తిని గ్రామంలోని పలువురు అస్వస్థతకు గురైన విషయంపై ఆమె గ్రామంలో రోగులతో, గ్రామస్థులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ... మంచి ఆహార అలవాట్లను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. స్థానిక ఆర్డీటీ కమ్యూనిటీ భవనంలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరాన్ని ఆమె పరిశీలించారు. కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైనవారిని పరామర్శించారు. అంటువ్యాధిగా వ్యాప్తి చెందే నీళ్ల విరేచనాల పట్ల అతి జాగ్రత్తగా ఉండాలన్నారు. ఆరోగ్య సిబ్బందికి సూచనలు, సలహాలు అందించారు. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ, ఇతర వాటిని ఆమె పరిశీలించారు. డీఎంహెచ్ఓతో పాటు డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సునీల్, డీపీఎంఓ నాగేంద్రనాయక్, వైద్యాధికారి డాక్టర్ భానుప్రకాష్, వైద్య సిబ్బంది ప్రమీళ, రామకృష్ణమ్మ, దిల్షాద్, శ్రావణి, అసిన్‌తాజ్, అనుసూయ, గోపాల్‌నాయక్, ప్రభాక ర్, బాలాజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## వేరుశనగ విత్తన పంపిణీ

● రైతు సంఘాల ద్వారా ఉచితంగా అందజేత

తనకల్లు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని మల్లిరెడ్డిపల్లిలో రైతు సంఘాలకు కేంద్ర ప్రభుత్వం విత్తన వేరుశనగను ఉచితంగా కేటాయించింది. ప్రత్యేకంగా నూనె ఉత్పత్తికోసం కేటాయించిన విశిష్ట 1694 రకం వేరుశనగ విత్తనకాయల పంపిణీని మండల వ్యవసాయాధికారి భారతి గురువారం చేపట్టారు. రైతు సంఘాల ద్వారా ఎంపిక చేసిన రైతులకు వాటని ఉచితంగా పంపిణీ చేస్తున్నామని ఏఓ తెలిపారు. విద్యుత్ సౌకర్యం కలిగి, వ్యవసాయ బోరు ఉన్న రైతులు మాత్రమే అర్హులని తెలిపారు. రైతు సంఘాలు విత్తన వేరుశనగ పొందే రైతులచే గ్యారెంటీ పత్రాలను తీసుకుని, విత్తనకా యలు అందిస్తున్నారు. కాయలు తీసుకున్న రైతులు తప్పకుండా పంట లు సాగుచేయాలని, అలా సాగుచేయని రైతులు విత్తనకాయల పూర్తి ధర చెల్లించేలా గ్యారెంటీ పత్రాలు తీసుకుంటున్నట్లు ఏఓ పేర్కొన్నారు. ఆర్డీఏ బ్ల్యూఐ ప్రాజెక్టు పరిధిలో విత్తన కాయలను జనజాగృతి ఆధ్వర్యంలో చేపట్టారు. ఈపంపిణీలో జనజాగృతి, రైతు సంఘాల సభ్యులు, రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది ఉన్నారు.

## యంగ్ పార్లమెంట్‌పై అవగాహన



విద్యార్థులకు బహుమతులు అందజేసిన ఎంపీడీఓ, ఎంఈఓలు

ధర్మవరం రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ప్రాజెక్టు లక్ష్య కార్యక్రమంలో భాగంగా యంగ్ పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీడీఓ సాయిమనోహర్, ఎంఈఓలు రాజేశ్వరి, గోపాల్‌నాయక్ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ... ప్రాజె క్టు లక్ష్య అనేది మంచి ప్లాట్‌ఫామ్ అన్నారు. విద్యార్థి దశ నుంచి స్కిల్స్ డెవలప్‌మెంట్ కోసం ఎంతోగానో ఉపయోగపడుతుందన్నారు. అదేవిధంగా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణా లను, కమ్యూనికేషన్ స్కిల్స్‌ను, ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు 21వ శతాబ్దిలో భారతదేశం పాత్ర, ప్లాస్టిక్ పొల్యూషన్, ప్రాథమిక హక్కులు, లింగ సమానత్వం తదితర అంశాలపై చర్చించారు. అందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన రేగాటిపల్లి ఎంజేపీ పాఠశాల విద్యార్థులకు ప్రథమ బహుమతి దక్కగా, మోటుమర్ల కేజీబీవీ విద్యార్థినులకు రెండో బహుమతి, చిగిచెర్ల ఉన్నతపాఠశాల విద్యార్థులు మూడో బహుమతి అందుకున్నారు. పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిలో రహదారి ఏర్పాటు

అడ్డుకున్న రెవెన్యూ అధికారులు



పనులను అడ్డుకుంటున్న అధికారులు

పెనుకొండ టౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మడకశిరకు వెళ్లే రహదారిలో ఉన్న గొర్రెల పెంపక క్షేత్రానికి సంబంధించిన ప్రభుత్వ భూమిలో ఓ రిసార్ట్‌కు 40అడుగుల రోడ్డు ఏర్పాటు చేసుకుంటుండగా రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. గురువారం అనధికారికంగా ఎక్స్‌కావేటర్, టిప్పర్లతో రోడ్డుకు మట్టిని తరలిస్తున్నట్లు సమాచారం తెలుసుకుని సర్వేయర్ శ్రీనివాసులు, ఆర్ఐ షాషావలి, వీఆర్ఓ తేజ రిసార్ట్ వద్దకు వెళ్లి ప్రశ్నించారు. రికార్డులు తీసుకుని కార్యాలయానికి రావాలని తెలిపారు. ఇదే క్రమంలో గొర్రెల పెంపక క్షేత్రం అధికారులు తమ భూమిలో రహదారి వేశారని అధికారులకు తెలిపారు.

## వడ్డె ఓబన్న విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



భూమి పూజలో పాల్గొన్న వడ్డెర్లు, టీడీపీ నాయకులు

చిలమత్తూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమర యోధుడు వడ్డె ఓబన్న విగ్రహం ఏర్పాటుకు గురువారం చిలమత్తూరు మండల కేంద్రంలో భూమి పూజ నిర్వహించారు. టీడీపీ జిల్లా అధ్యక్షులు కొల్లకుంట అంజినప్ప, మండల కన్వీనర్ శ్రీనివాసులు, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొల్లకుంట అంజినప్ప మాట్లాడుతూ వడ్డెర్లు అన్ని రకాలుగా చైతన్యం కావాలన్నారు. తమ పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. రాజకీయ పార్టీలు ఏవైనా వడ్డెర్లకు సముచిత స్థానం కల్పించాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వడ్డెర్లను గుర్తించి రాజకీయ అవకాశాలు కల్పిస్తోందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సూర్యనారాయణ, చంద్ర, క్రిష్ణమూర్తి, గంగాధర్, వెంకటేశులు తదితరులు హాజరయ్యారు.

## రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో ప్రతిభ



ప్రతిభచూపిన విద్యార్థులతో ప్రిన్సిపాల్

మడకశిర రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన క్రీడల్లో మడకశిర పశుసంవర్ధక పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు విజేతలుగా నిలిచినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ శివకుమార్‌రెడ్డి తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా వెంకటరామన్న గూడెంలో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు జరుగుతున్నాయన్నారు. ఇందులో గురువారం నిర్వహించిన పోటీల్లో బాలుర విభాగంలో 100 మీటర్ల పరుగుపందెంలో అనిల్ మొదటి స్థానం, 400 మీటర్ల విభాగంలో శివప్రసాద్ ద్వితీయస్థానం సాధించినట్లు తెలిపారు. బాలికల 200 మీటర్ల పరుగు పందెంలో మానస ద్వితీయస్థానం, 400 మీటర్ల విభాగంలో స్నేహలత ద్వితీయస్థానం సాధించడం జరిగిందన్నారు. ఖోఖోలో కూడా బాలురు, బాలికల జట్లు ద్వితీయస్థానంలో నిలిచాయన్నారు.

## సభను విజయవంతం చేయండి

ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు



పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

పెనుకొండ టౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మాదిగల మహోద్యమ విజయోత్సవ సభ విజయవంతం చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌వద్ద చలో విజయవాడ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిసెంబరు 4న విజయవాడలో పెద్దఎత్తున అభినందన సభ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణపై తెలంగాణ ఏపీ ముఖ్యమంత్రులు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు స్పందించి ఏ, బీ, సీ వర్గీకరణ చట్టం చేసి మాదిగ, ఉప కులాలకు సామాజిక న్యాయం చేసిన ప్రభుత్వాలకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. విజయోత్సవ సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నరసింహులు, పట్టణ అధ్యక్షుడు గౌతంప్రసాద్, ప్రశాంత్, నాగరాజు, పోతులయ్య పాల్గొన్నారు.

## వైభవంగా కుంభాభిషేకం



పూజల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్

హిందూపురం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీచర్స్‌కాలనీలో వెలసిన అచలేశ్వర ఆలయంలో గోపుర కలశస్థాపన, కుంభాభిషేకం వైభవంగా జరిగింది. గురువారం తెల్లవారుజామునుంచే కలశస్థాపన, కుంభాభిషేకం, గణపతిపూజ, రుద్రాభిషేకం, నవగ్రహహోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రమేష్, నాయకులు పాల్గొన్నారు.

## క్రీడలు ఎంతో అవసరం: డీఎస్పీ

హిందూపురం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): చదువుతోపాటు క్రీడలు ఎంతో అవసరమని డీఎస్పీ మహేష్ అన్నారు. పట్టణంలోని జ్ఞానజ్యోతి పాఠశాలలో క్రీడ దినోత్సవ వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో పాల్గొనడంవల్ల మానసిక ఒత్తిడి తగ్గి శారీరక దృఢత్వం పెరుగుతుందన్నారు. గెలుపోటములపై ఆత్మస్థైర్యం వస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ గంగప్ప, పాఠశాల హెచ్‌ఎం ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అర్ధాంతరంగా ఆగిన భవన నిర్మాణాలు

సచివాలయాలు, హెల్త్‌క్లినిక్‌లు, ఆర్‌బీకేలు

వైసీపీ హయాంలో ప్రారంభం

బిల్లుల పెండింగ్‌తో ఆగిన పనులు

కూటమి ప్రభుత్వం పూర్తిచేసేనా..?



పందిపర్తిలో చిన్నపాటి మరమ్మతుతో ఆగిన సచివాలయ భవన నిర్మాణం

సోమందేపల్లి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రజాధనం వృథా అయ్యింది. మండలంలో గత వైసీపీ హయాంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టిన సచివాలయాలు, ఆర్‌బీకే కేంద్రాల భవనాలు, హెల్త్ సెంటర్ కొన్ని పూర్తికాగా మరికొన్ని అర్ధాంతరంగా ఆగిపోయాయి. దాదాపు ఆరేళ్లు గడుస్తున్నా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా తయారైంది పరిస్థితి. మండల వ్యాప్తంగా 2019-20లో 14 సచివాలయాలు మంజూరయ్యాయి. ఒక్కొక్కటి రూ.43.6లక్షల వ్యయంతో అప్పట్లో నిర్మాణాలు ప్రారంభించారు. చల్లాపల్లి మినహా అన్ని ప్రాంతాల్లో నిర్మాణాలు చేపట్టారు. ఇందులో తుంగోడు, గుడిపల్లి, మాగేచెరువు, చాలకూరు పంచాయతీల్లో భవన నిర్మాణాలు పూర్తయి అందుబాటులోకి వచ్చాయి. అయితే పది సచివాలయ భవనాలు వివిధ దశల్లో ఆగిపోయాయి. బ్రహ్మసముద్రం, సోమందేపల్లి-1, 3, పందిపర్తి గ్రామంలో ఫెన్సింగ్ లెవెల్‌లో సచివాలయాలు ఆగిపోగా సోమందేపల్లి-2 సచివాలయ భవనం బేస్‌మెంట్ లెవెల్‌లో మండ్లి ఫస్ట్‌ఫ్లోర్ రూఫ్‌లెవెల్, జూలకుంట పైకప్పుదశలో నిలిచిపోయాయి. కేతగానిచెరువు పైకప్పు దశల్లోనే ఉంది. ఇక రైతు సేవా కేంద్రాలు మండలానికి 13 మంజూరయ్యాయి. వీటిలో మూడు పూర్తికాగా తొమ్మిది వివిధ దశల్లో నిలిచిపోయాయి. చల్లాపల్లి గ్రామంలో భవన నిర్మాణం ప్రారంభం కాలేదు. అలాగే హెల్త్‌సెంటర్లు మండలానికి తొమ్మిది మంజూరుకాగా రెండు పూర్తయ్యాయి. ఏడు వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్నాయి. రూ. కోట్ల వ్యయంతో నిర్మాణం చేపట్టిన భవనాలు ఆరేళ్లుగా ఆగిపోయి వివిధ దశల్లో నిలిచిపోవడంతో ప్రజాధనం వృథా అవుతోంది. కూటమి ప్రభుత్వం సచివాలయ భవనాలను విజన్ సెంటర్లుగా మార్పుచేసి రీగ్రూపింగ్ ద్వారా మెరుగైన సేవలు ప్రజలకు అందించేందుకు కృషిచేస్తోంది. ఈ నేపథ్యంలో పది సచివాలయ భవనాలు ఆగిపోవడంతో పంచాయతీ కార్యాలయాల్లోని గదుల్లో సచివాలయాలు కొనసాగుతున్నాయి. పక్కా భవనాలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి దశల్లో ప్రభుత్వం శ్రీకారం చుట్టిన కొత్త విధానం అమలులో సత్ఫలితాలు రావాలంటే పెండింగ్‌లో ఉన్న భవనాలు పూర్తిచేసి సరిపడా సిబ్బందిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఎంపీడీఓ వెంకటలక్ష్మిని వివరణ కోరగా వైసీపీ హయాంలో నిర్మాణం ప్రారంభించారని, బిల్లులు పెండింగ్, స్థల వివాదం, కోర్టు కేసులు తదితర కారణాలతో నిర్మాణాలు ఆగిపోయాయన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఆమె పేర్కొన్నారు.

## చెరువు ఆక్రమణదారులకు నోటీసులు



నోటీసులు అందజేస్తున్న అధికారులు

పరిగి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): చెరువు పొరంబోకు స్థలంలో దుకాణాలు, భవనాలు, ఇటుక బట్టీలు నిర్మించుకుని వ్యాపారం కొనసాగిస్తూ చెరువు ప్రాంతాన్ని కబ్జా చేసుకున్నారు. 'పెద్దచెరువును చెరబట్టారు' అన్న కథనం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. కథనానికి స్పందించిన అధికారులు గురువారం ఆక్రమణదారులకు నోటీసులు అందజేశారు. చెరువు పంచాయతీ అధికారి నారాయణ, సిబ్బంది ఇంటింటికీ వెళ్లి నోటీసులు ఇచ్చారు. 15 రోజుల్లోగా ఇంటికి సంబంధించిన పత్రాలు సచివాలయం వద్దకు తీసుకురావాలనీ, లేనిపక్షంలో ప్రభుత్వం చట్టప్రకారం ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటుందని పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

### పట్టాలు మంజూరు చేయాలంటూ వేడుకోలు

40ఏళ్లుగా చెరువు ముంపు ప్రాంతంలో జీవిస్తున్నామని, ఇంటి నిర్మాణం చేపట్టామని ఉన్నఫలంగా నోటీసులు అందిస్తే తమ పరిస్థితి ఏంటని బాధితులు పంచాయతీ సిబ్బంది వద్ద మొరపెట్టుకున్నారు. ఇంటి గుత్తులు, కరెంటు, నీటి కొళాయిలు, గుత్తులు సక్రమంగా కడుతున్నామన్నారు. తమకు వేరేచోట పట్టాలు అందించి ఇంటినిర్మాణం చేపట్టాలని వారు ప్రభుత్వానికి విన్నవించారు.

## విపత్తుల నివారణపై అవగాహన

లేపాక్షి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సహజవిపత్తులు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను స్థానిక మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల కళాశాల విద్యార్థులకు గురువారం జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ ఇన్‌స్పెక్టర్ శాంధిల్ బృందం అవగాహన కల్పించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు, భూకంపాలు సంభవించినప్పుడు ప్రాణాపాయ స్థితి నుంచి రక్షించే విధానాల్ని వివరించారు.

## స్టడీ మెటీరియల్ పంపిణీ

పెనుకొండ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు ఎంకే నబి, ఎంఈఓ రాఘవయ్య, విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ చేశారు.

## విధుల నుంచి తొలగింపు

గోరంట్ల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న ఏఎన్ఎం విజయను జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి విధుల నుంచి తొలగించారు. ఫుడ్ పాయిజన్ జరిగిందన్న అవాస్తవానికి ప్రధాన కారణమని అధికారుల విచారణలో తేలడంతో ఆమెను విధులనుంచి తొలగించారు. బాలికలు అస్వస్థతకు గురైన సమాచారాన్ని వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయలేదని డీఎస్‌సిడబ్ల్యు మోహన్‌రామ్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ తులసీబాయిని తొలగించి ఆమె స్థానంలో ఉపాధ్యాయురాలు చంద్రకళను నియమించారు. ఆమె గురువారం బాధ్యతలు స్వీకరించారు.

## వేమన విగ్రహ ఏర్పాటుకు విరాళం

గోరంట్ల, నవంబరు27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హిందూపురం రహదారి పక్కన వేమన విగ్రహ ఏర్పాటుకు బూదిలి నారాయణరెడ్డి కుమారులు రూ. 2లక్షల విరాళాన్ని గురువారం అందచేశారు. టీడీపీ నాయకులు, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, నాగిరెడ్డి, కుటుంబ సభ్యులు రూ. రెండులక్షల చెక్కును రెడ్డిసంఘం నాయకులకు అందించారు.

## పీ4 శిక్షణ తరగతులు

అమరాపురం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయ భవనంలో గురువారం పీ4 శిక్షణ తరగతులు జరిగాయి. ఎంపీడీఓ రామారావు పాల్గొన్నారు. ఏ ఒక్కరు కూడా ఆకలితో అలమటించకూడదని, నిరుపేదలు లేని దేశంగా ఉండాలన్న దృఢ సంకల్పంతో పీఎం నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉన్నారన్నారు. ఈ నేపథ్యంలో అనేక సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. కార్యక్రమంలో ఈఓ ఆర్డీ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు నరేష్‌బాబు, సురేష్, గౌరమ్మ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీలో అక్రమాలు అరికట్టండి

ఈఓకు ఫిర్యాదు

పావగడ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): వెంకటాపురం గ్రామ పంచాయతీలో జరుగుతున్న అక్రమాలను అరికట్టాలని ఆ గ్రామానికి చెందిన సుమన్, మురళి ఈఓ ఉత్తంకు గురువారం వినతిపత్రం అందించారు. సమాచార హక్కుచట్టం కింద 2023 జనవరి నుంచి 2025 ఆగస్టు వరకు సమాచారం అడగడం జరిగిందన్నారు. అందులో 88 నుంచి 100వ పేజీ వరకు సభ నడవడిక పత్రాలు చింపివేసి ప్రభుత్వాన్ని మోసం చేశారని వారు ఆరోపించారు. తప్పు చేసినట్లు రుజువైతే సంబంధిత సిబ్బందిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈఓ వారికి తెలిపారు.

## 'విద్యతోనే సమాజాభివృద్ధి'

గుడిబండ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని సింగిల్‌విండో అధ్యక్షులు మద్దనకుంటప్ప పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఎంఎస్ తండా గ్రామంలో గుడిబండ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ పీఓ ఆధ్వర్యంలో విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండి పిల్లల చదువుపట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని మద్దనకుంటప్ప సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ శంకర్, అధ్యాపకులు రాందాస్, నాయక్ పాల్గొన్నారు.




ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

## వెల్ఫేర్ అసిస్టెంట్‌కు మెమో



వానవోలు సచివాలయాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

గోరంట్ల, నవంబరు27(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని వానవోలు గ్రామ సచివాలయంలో సిబ్బంది సరిగా విధులకు రావడంలేదన్న ఫిర్యాదుపై ఎంపీడీఓ కమలాబాయి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వెల్ఫేర్ అసిస్టెంట్ గైర్హాజరు కావడంతో మెమోజారీ చేయాలని కార్యదర్శి జయపాల్‌రెడ్డిని ఎంపీడీఓ ఆదేశించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మూడు మెమోలు జారీ చేసిన మీద తనకు సమాచారం అందిస్తే అలాంటి ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు చేపడతామని ఎంపీడీఓ కార్యదర్శికి తెలిపారు. అనంతరం సచివాలయం-2 నూతన భవనాన్ని పరిశీలించి, పెండింగ్ పనులను వెంటనే పూర్తిచేయాలని నిర్వాహకులను ఆదేశించారు. ఆమెతోపాటు టీడీపీ మండల కన్వీనర్ బాలక్రిష్ణచౌదరి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

## దళితులకు అవకాశం కల్పించండి

నిడిగల్ వాల్మీకి సంస్థ పీఠాధిపతి



మాట్లాడుతున్న సంజయ్‌కుమార్ స్వామీజీ

పావగడ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): దళితులకు ముఖ్యమంత్రి అవకాశం కల్పించాలని నిడిగల్ వాల్మీకి సంస్థ పీఠాధిపతి సంజయ్‌కుమార్ స్వామి కోరారు. ముగ్గురు వాల్మీకి ఎమ్మెల్యేలకు మంత్రి స్థానం కల్పించి ఇద్దరిని తొలగించడం దారుణమన్నారు.

## టీడీపీ పురం పరిశీలకుడిగా లక్ష్మీనారాయణ



సమావేశంలో పాల్గొన్న లక్ష్మీనారాయణ

మడకశిర టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణ తెలుగుదేశం పార్టీ పరిశీలకుడిగా రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణను నియమించారు. గురువారం ఆయన పట్టణ అధ్యక్షుడు వెంకటేష్‌తో కలిసి 55, 56, 59, 60 బూత్ కన్వీనర్లు, నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేవిధంగా కార్యాచరణ చేశారు.

## అర్హులకు ఇంటిపట్టాలు మంజూరు చేయండి

సీపీఎం నాయకుల డిమాండ్

పెనుకొండ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): అర్హులకు ఇంటిపట్టాలు మంజూరు చేయాలని సీపీఎం పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌వద్ద ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు హరి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు అర్హులైనవారికి ఇల్లు, ఇంటిపట్టాలు ఇవ్వాలని కోర్టు ఉత్తర్వులు అమలు చేయాలని ముద్రించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా హరి మాట్లాడుతూ సర్వేనంబరు 688-3లో పేదలు వేసుకున్న గుడిసెలను దౌర్జన్యంగా తొలగించారని, అరెస్ట్‌చేసి నాయకులపై కేసులు నమోదుచేశారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పట్టణంలో రెండుసెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడుసెంట్లు ఇంటిపట్టాలు ఇవ్వాలన్నారు. ఇంటిపట్టాల కోసం ఈనెల 29న ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బాబావలి, వెంకటరాముడు, తిప్పన్న, అంజినప్ప, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

## రైతుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి



రైతన్నా.. మీకోసం కరపత్రాలను రైతులకు అందజేస్తున్న తిప్పేస్వామి

మడకశిర రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వం లక్ష్యమని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి తెలిపారు. గురువారం మండలంలోని ఆమిదాలగొంది పంచాయతీ కేంద్రంలో రైతన్న.. మీ కోసం కార్యక్రమం నిర్వహించారు. సీఎం చంద్రబాబునాయుడు రైతులకు రాసిన లేఖను కరపత్రాల రూపంలో రైతులకు అందచేశారు. అనంతరం గుండమల తిప్పేస్వామి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు వ్యవసాయాన్ని లాభసాటిగా చేయాలన్నా లక్ష్యంతో పనిచేస్తున్నారన్నారు. అన్నదాత సుఖీభవ కింద ఇప్పటికే రెండు విడతలుగా రైతుల ఖాతాల్లోకి డబ్బు జమ చేయడం జరిగిందన్నారు. ఏ ప్రాంతంలో ఎలాంటి పంటలు లాభదాయకమో గుర్తించి ప్రభుత్వం సహకారం అందిస్తోందన్నారు. కాలానికి అనుగుణంగా పంటల సాగు, వ్యవసాయం అనుబంధ రంగాలకు తోడ్పాటు ఇవ్వడం జరుగుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు నాగభూషణ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, కోట్ల రంగేగౌడ్, గిరి తదితరులు పాల్గొన్నారు.

**రొళ్ల:** మండల పరిధిలోని వన్నప్పపాళెంలో రైతన్న మీకోసం కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి పాల్గొన్నారు. అన్నదాత సుఖీభవ డబ్బు జమ అయ్యిందా..? అని అడిగి తెలుసుకున్నారు. డబ్బులు పడనివారు రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ షెక్షావలి, వెంకటబ్రహ్మం, మార్కెట్‌యార్డ్ చైర్మన్ గురుమూర్తి, సింగిల్ విండో అధ్యక్షుడు దాసిరెడ్డి, మండల కన్వీనర్ ఈరన్న, ప్రధాన కార్యదర్శి ఉగ్రేగౌడ్ పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న నాయకులు

● **మడకశిర టౌన్:** రైతులు అభివృద్ధి చెందాలంటే ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలోనే సాధ్యమని టీడీపీ పట్టణ అధ్యక్షులు నాగరాజు అన్నారు. రైతులకు అన్ని విధాలా అండగా ఉంటూ వారికి ప్రోత్సాహం అందించడం జరుగుతుందని అన్నారు. గురువారం పట్టణ సమీపంలోని అక్కంపల్లిలో రైతన్నా.. నీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. కౌన్సిలర్లు ఉమేష్, క్లస్టర్ ఇన్‌చార్జి తిమ్మరాజు, నాయకులు హనుమంతరెడ్డితోపాటు పలువురు పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి రైతులకు ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. రైతులను అన్ని విధాలా ఆదుకోవడంతోపాటు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు సీఎం చంద్రబాబు చేస్తున్న కృషిని వివరించారు.



రైతన్నా.. మీకోసంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

● **గోరంట్ల:** మండలపరిధిలోని దిగువ గంగంపల్లి, దిగువపల్లితండాలో టీడీపీ నాయకులు గురువారం నూతన వ్యవసాయ పద్ధతులను రైతులకు వివరించారు. రైతన్నా.. మీకోసం కార్యక్రమంలో భాగంగా వివిధ గ్రామాల్లో వారు పర్యటించారు. ప్రభుత్వ సంక్షేమపథకాలను వివరించారు. అనంతరం సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ కన్వీనర్ బాలక్రిష్ణచౌదరి, నిమ్మల శ్రీధర్, నాగేనాయక్, టైలర్ రుద్ర, రోహిత్ పాల్గొన్నారు.



రైతులతో అధికారులు

● **రొద్దం:** రాష్ట్రప్రభుత్వం రైతులకు అందించే వివిధ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయశాఖ అధికారి రాజేష్ పేర్కొన్నారు. గురువారం రొద్దం మండల పరిధిలోని ఆర్.మరువపల్లిలో రైతన్న మీకోసం ద్వారా రైతులకు సూచనలు, సలహాలు అందించారు. ప్రభుత్వం సకాలంలో విత్తనాలు, ఎరువులు, డ్రిప్ పరికరాలు ట్రాక్టర్లు, యంత్రాలు సబ్సిడీ ధరలతో అందిస్తుందన్నారు. కార్యక్రమంలో జాఫర్‌వలి, టీడీపీ నాయకులు జానకీరాముడు, జయరాం తదితరులు పాల్గొన్నారు.

## మూడు రోజుల్లో సర్వే పూర్తవ్వాలి: జేడీఏ



రైతులతో మాట్లాడుతున్న జేడీఏ

పెనుకొండ రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రానున్న మూడు రోజుల్లో ఇంటింటి సర్వే పూర్తిచేయాలని జిల్లా వ్యవసాయాధికారి శ్రీరాములునాయక్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన రైతన్న మీకోసం ఇంటింటి సర్వేలో భాగంగా గురువారం మండలంలోని శెట్టిపల్లి, బొజ్జిరెడ్డిపల్లి గ్రామాల్లో ఆయన పర్యవేక్షించారు. ఏడీఏ కృష్ణమీనన్, ఏఓ చందన సిబ్బందితో కలిసి గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ జీఎం గీత, సిరికల్చర్ ఆఫీసర్ ఓబులేసు, ఏఈఓ అశోక్‌కుమార్, వీఆర్ఓ, రైతులు సిబ్బంది పాల్గొన్నారు.

● **అగళి:** మండలంలోని నరసంబుది, రావుడి, ఆర్‌జిపల్లి గ్రామాల్లో వ్యవసాయ, అనుబంధశాఖల అధికారులు రైతన్నమీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం రైతులకు అందిస్తున్న పథకాలపై ఏఓ నాగరాజు అవగాహన కల్పించారు.



ఎస్.రాయాపురంలో రైతులకు కరపత్రాలు అందిస్తున్న అధికారులు

● **గుడిబండ:** రైతు సంక్షేమమే ప్రభుత్వం ధ్యేయమని టీడీపీ నాయకులు నాగేంద్రప్ప పేర్కొన్నారు. గురువారం ఎస్ రాయాపురం గ్రామంలో వ్యవసాయశాఖ అధికారులు ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, రైతులకు అందించే సుఖీభవ, పీఎం కిసాన్ తదితర వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది రంగనాథ్, ఈరన్న, నాయకులు నటరాజ్, రమేష్, పులిరాజు, రైతులు పాల్గొన్నారు.